

07

ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్.. కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్


www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

RNI No: TELTEL/2024/86684

సోమవారం | 16.06.2025 | సంపుటి : 2 | సంచిక :135 | పేజీలు : 8 | వెల : 2/-



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 91824 74575


దక్షిణార్ధ దేశాల గొంతుకకు

# జీ7 వేదిక

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్య**

**3 దేశాల పర్యటనలో భాగంగా సైప్రస్ చేరిక**

కెనడా వేదికగా జరగనున్న జీ7 శిఖరాగ్ర సమావేశం.. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను, దక్షిణార్ధ గోళ దేశాల (గ్లోబల్ సౌత్) గొంతును వినిపించడానికి గొప్ప వేదిక కానుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శిఖరాగ్ర సమావేశంలో భాగస్వామ్య దేశాల నాయకులతో చర్చలు జరిపేందుకు ఎదురు చూస్తున్నానని తెలిపారు. 3 దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం దిల్లీ నుంచి బయలుదేరిన ఆయన సైప్రస్ చేరుకున్నారు.



02

# నదిలో కూలిన వంతెన..

- ఇద్దరు మృతి, పలువురి గల్లంతు
- పుణె జిల్లాలోని ఇంద్రాయణి నదిపై ఘటన



03

నెలాఖరులోగా స్థానిక

# ఎన్నికల షెడ్యూలు

**వచ్చే క్యాబినెట్ భేటీలో ఎన్నికల తేదీలపై స్పష్టత**

**నేటి నుంచి రైతుల ఖాతాల్లో 'భరోసా'**

- వారం రోజుల పాటు పెట్టుబడి సాయం
- భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కూసుమంచి, జూన్ 15 :
ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూలు వెలువడుతుందని, సోమవారం మంత్రులతో సీఎం నిర్వహించే సమావేశంలో ఎన్నికల తేదీపై స్పష్టత వస్తుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తొలుత మండల, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు జరుగుతాయని, ఆ తర్వాత గ్రామపంచాయతీలు, పురపాలికలకు జరుగుతాయని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సూచించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం పరిధిలోని కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మం గ్రామీణం మండలాల కాంగ్రెస్ నాయకులతో మంత్రి ఆదివారం విడివిడిగా సమావేశమయ్యారు. అంతకుముందు కూసుమంచిలోనే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏరువాక' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఓ రైతు క్షేత్రంలో స్వయంగా అరక దున్ని, రెండు వరసలుగా అచ్చు తోలారు. మహిళా కూలీలతో కలిసి పత్తి విత్తనాలు విత్తారు.

మిగతా 2 లో



సర్కారు బడుల్లో

# అత్యాధునిక బోధన

- 'స్టెమ్' సబ్జెక్టుల్లో వీడియో ఆధారిత బోధన
- కోడింగ్, కంప్యూటేషనల్ థింకింగ్‌తోపాటు నీట్, జేఈఈ, క్లాట్ పోటీ పరీక్షలకు శిక్షణ
- బాలికల అక్షరాస్యత.. విద్యావకాశాల పెంపు
- ఉచిత సేవలకు ముందుకొచ్చిన ఆరు స్వచ్ఛంద సంస్థలు
- సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో విద్యాశాఖ ఒప్పందాలు

హైదరాబాద్, జూన్ 15 :
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధన సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర విద్యాశాఖ.. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ(ఎన్‌జీఓ)లతో పరస్పర అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఆరు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన ఎడ్‌టెక్ సదుపాయాలు కల్పించనుంది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదివారం ఆరు ఎన్‌జీఓ ప్రతినిధులతో ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. నందన్ నీలేకని నేతృత్వంలోని ఏక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే ఆధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ నిర్వహిస్తున్న పైజామ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ ఆధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ వంటి పేరొందిన సంస్థలు ఎంఓయూలు కుదుర్చుకున్న ఎన్‌జీవోల జాబితాలో ఉన్నాయి.

మిగతా 2 లో

**నేడు రైతులతో సీఎం ముఖాముఖి**

- 1,034 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

02



కేదార్‌నాథ్‌లో కూలిన

## హెలికాప్టర్

**పైలట్, ఆరుగురు యాత్రికుల దుర్మరణం**



యాదగిరీశుడి క్షేత్రం..

## భక్తజన సంద్రం

- స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**యాదగిరిగుట్ట :** యాదగిరీశుడి క్షేత్రం ఆదివారం భక్తజనంతో కోలాహలంగా మారింది. వారాంతం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. వేకువజాము నుంచి మొదలైన రద్దీ రాత్రి వరకు కొనసాగింది. 65 వేల మంది పంచనారసింహులను దర్శించుకున్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.80,11,461 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

## తెరుచుకున్న నారాయణపూర్ ప్రాజెక్టు గేట్లు

- జూరాల వైపు 50 వేల క్యూసెక్కులు
- శ్రీశైలానికి 34 వేల క్యూసెక్కుల ప్రవాహం

02



03

ఎయిరిండియా ప్రమాద ఘటన

విజయ్ రూపాణీ మృతదేహం గుర్తింపు



03

కనీవినీ ఎరుగని స్థాయిలో ప్రతిస్పందిస్తాం

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

గోదావరి-బనకచర్లతో

# తీవ్ర నష్టం

- వెంటనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు కేంద్రాన్ని డిమాండ్ చేయాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హరీశ్‌రావు లేఖ

గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టు వల్ల గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులకు తీవ్ర నష్టం కలుగుతుందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ తీసుకుంటున్న చర్యలు రాష్ట్ర పునర్విభజన చట్టం-2014తోపాటు నదీ జలాల బోర్డుల నియమాలను ఉల్లంఘించడమేనన్నారు. వెంటనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలంటూ కేంద్రాన్ని కోరాలని ఆయన సూచించారు.



02



## నేడు జన గణన గెజిట్ నోటిఫికేషన్

**దిల్లీ:** దేశంలో 15 ఏళ్ల తర్వాత చేపట్టబోయే జన గణనకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ సోమవారం విడుదల కానుంది. ఇది మొత్తంగా 16వ, స్వాతంత్ర్యానంతరం చేపట్టబోయే 8వ జన గణన. దీనిపై ఆదివారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమీక్షించారు. రెండు దశల్లో జరగబోయే జన గణన.. 2027 మార్చి 1వ తేదీ నాటికి పూర్తి కానుంది. ఈసారి జన గణనతోపాటు కుల గణననూ చేపడుతున్నారు. ఇందుకోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పని చేస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుంది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యాప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదుచేసే వెసులుబాటునూ కల్పిస్తున్నారు.



ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలతో చమురు, బంగారం,

# విమాన టికెట్లకు రెక్కలు



ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు మరో యుద్ధానికి దారి తీస్తాయనే ఆందోళనలు అంతకంతకూ తీవ్రమవుతున్నాయి. ఈ పరిణామాలతో ముడిచమురు ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉండగా, విమాన రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయాలు ఏర్పడనున్నాయి. అమెరికాతో ఇరాన్ అణు చర్చలు కూడా నిలిచిపోయినట్లేనని ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఏ అంశాలపై ఎలా ప్రభావం చూపించొచ్చంటే..

07



## దక్షిణార్ధ దేశాల గొంతుకకు జీ7 వేదిక

- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్య
- 3 దేశాల పర్యటనలో భాగంగా సైప్రస్ చేరిక

**న్యూఢిల్లీ:** కెనడా వేదికగా జరగనున్న జీ7 శిఖరాగ్ర సమావేశం.. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను, దక్షిణార్ధ గోళ దేశాల (గ్లోబల్ సౌత్) గొంతును వినిపించడానికి గొప్ప వేదిక కానుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శిఖరాగ్ర సమావేశంలో భాగస్వామ్య దేశాల నాయకులతో చర్చలు జరిపేందుకు ఎదురు చూస్తున్నానని తెలిపారు. 3 దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం ఢిల్లీ నుంచి బయలుదేరిన ఆయన సైప్రస్ చేరుకున్నారు. బయలుదేరే ముందు ఒక ప్రకటన విడుదల చేశారు. సీమాంతర ఉగ్రవాదంపై పోరాటంలో భారత దేశానికి మద్దతు ఇచ్చినందుకు భాగస్వామ్య దేశాలకు కృతజ్ఞతలు తెలిపేందుకు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ప్రపంచ వ్యాప్తంగా అవగాహనను పెంపొందించేందుకు ఈ పర్యటన ఒక గొప్ప అవకాశం అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్నారు. ఆయనకు లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ సాదర స్వాగతం పలికారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని సైప్రస్‌కు వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 'సైప్రస్‌లో దిగా. నాకు స్వాగతం పలికిన అధ్యక్షుడికి కృతజ్ఞతలు. భారత్, సైప్రస్ సంబంధాల్లో గణనీయ ప్రగతికి ఈ పర్యటన దోహదం చేయనుంది. ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులపై మరింతగా కలిసి పని చేసే అవకాశముంది' అని మోదీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ఐరోపా కూటమికి ఆగ్నేయ తీరంగా, మధ్యధరా గేట్ వేగా ఉన్న సైప్రస్ తరఫున ప్రధాని మోదీకి స్వాగతం. ఈ చారిత్రక పర్యటన ద్వారా హద్దులు లేని వ్యూహాత్మక భాగస్వామ్యంలో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నాం. కలిసి మరింత ముందుకు సాగడానికి, పరివర్తనకు, అభివృద్ధికి ఇది నాంది పలకబోతోంది' అని క్రిస్టోడౌలిడెస్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సైప్రస్‌లో ప్రధాని మోదీ బస చేసిన హోటల్‌వద్ద ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. వారితో ప్రధాని సమావేశమయ్యారు. వాణిజ్య ప్రముఖులతోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. సైప్రస్ పర్యటన అనంతరం.. ప్రధాని మోదీ కెనడా వెళ్లి అక్కడ జరగనున్న జీ7 సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి క్రొయేషియా పర్యటనకు వెళ్తారు.



## నెలాఖరులోగా స్థానిక ఎన్నికల షెడ్యూలు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ నాయకులతో సమావేశంలోనూ, వ్యవసాయ క్షేత్రంలో విలేకరులతోనూ మంత్రి మాట్లాడారు. "స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి. అభ్యర్థులను గ్రామస్థాయి నాయకత్వమే నిర్ణయించుకోవాలి. ప్రజల్లో మంచి పేరున్న వ్యక్తులనే ఎంపిక చేయాలి. నాయకుల మధ్య లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకొని ఎన్నికలకు సమాయత్తం కావాలి. పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా ఎవరైనా పనిచేసినట్లు నా దృష్టికి వస్తే చర్యలుంటాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులదే. సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలి.

### త్వరలోనే ధాన్యం బోనస్ సొమ్ములు జమ

రాష్ట్రంలోని రైతులకు సోమవారం నుంచి వారం రోజులపాటు 'రైతు భరోసా' పెట్టుబడి సాయం అందించనున్నాం. ఒక్క గుంట వ్యవసాయ భూమి ఉన్న రైతు మొదలు పంటలు సాగయ్యే ప్రతి ఎకరానికి రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అవుతుంది. రైతులు వడ్డీ వ్యాపారులను, బ్యాంకులను ఆశ్రయించా ల్సిన అవసరం లేకుండా పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించి ంది. యాసంగిలో రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన బోనస్ సొమ్ములనూ కొద్దిరోజుల్లోనే జమ చేస్తాం" అని పొంగులేటి అన్నారు.

## తెరుచుకున్న నారాయణపూర్ ప్రాజెక్టు గేట్లు

- జూరాల వైపు 50 వేల క్యూసెక్కులు
- శ్రీశైలానికి 34 వేల క్యూసెక్కుల ప్రవాహం

**హైదరాబాద్:** కృష్ణా ప్రాజెక్టులకు స్వల్పంగా ప్రవాహాలు మొదలయ్యాయి. కర్ణాటకలోని ఎగువ కృష్ణా ప్రాజెక్టులైన ఆలమట్టికి 23 వేల క్యూసెక్కులు, నారాయణపూర్‌నకు 34 వేల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తున్నాయి. నారాయణపూర్ ప్రాజెక్టు గేట్లు తెరిచి దిగువనున్న జూరాల వైపు 50 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ద్వారా 44 వేల క్యూసెక్కులు, విద్యుత్ కేంద్రాల ద్వారా ఆరు వేల క్యూసెక్కులు నదిలోకి వదులుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 31.47 టీఎంసీల నిల్వ ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 34,819 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఇప్పటికే నిండిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు ఆరు వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా... దిగువకు 31 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. తుంగభద్ర నదిపై ఉన్న సుంకేశుల బ్యారేజీ ప్రాంతం నుంచి, జూరాల నుంచి కృష్ణా ప్రవాహం కలిసి శ్రీశైలానికి చేరుకుంటున్నాయి.

### పలు జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమ, మంగళ, బుధవారాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కొన్నిచోట్ల వానలు కురుస్తాయని పేర్కొంది. ఈ జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ములుగు జిల్లా వెంకటాపూర్‌లో 9 సెం.మీ., కుమురం భీం ఆసిఫాబాద్‌లో 7, వాంకిడిలో 5, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

# స్కిల్స్ యూనివర్సిటీకి మద్దతివ్వండి

- వాటికి ఐటీఐలను అనుసంధానం చేస్తాం
- కేంద్ర మంత్రి జయంత్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఐటీఐల్లో సోలార్ విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటుకు ఆదేశాలు



**హైదరాబాద్:** రాష్ట్రంలో నిరుద్యోగ యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణ ప్రభుత్వం నెలకొల్పిన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి జాతీయ నైపుణ్య శిక్షణ కింద తోడ్పాటు ఇవ్వాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఆంత్రప్రెన్యూర్‌షిప్ శాఖ మంత్రి జయంత్ చౌధరికి సీఎం విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డితో ఆదివారం కేంద్ర మంత్రి జయంత్ చౌధరి భేటీ అయ్యారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఇద్దరూ చర్చించారు. స్కిల్స్ డెవలప్‌మెంట్‌కు తాము తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. రాష్ట్రంలో వీఎఫ్ఎక్స్, గేమింగ్, ఆడియో విజువల్స్ రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని జయంత్ చౌధరి సీఎంకు సూచించారు. ఐటీఐలన్నింటికీ ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని కేంద్ర మంత్రి సీఎంను కోరారు. స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. తెలంగాణ చేపట్టే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం తరఫున సహకరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తాము ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసి.. దానికి ఐటీఐలను అనుసంధానిస్తామని కేంద్ర మంత్రికి తెలిపారు. ఐటీఐల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం వెంటనే అధికారులను ఆదేశించారు. ఆధునిక అవసరాలకు తగినట్లు ఐటీఐల్లో సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాల ని.. ఇందుకోసం ప్రత్యేక కమిటీని నియమించాలని అధికారులకు సీఎం సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, సీఎంవో పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం సీఈవో జయేశ్ రంజన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరగనున్న 'కౌశల్ మంథన్' కార్యక్రమంలో కేంద్ర మంత్రి జయంత్ చౌధరి పాల్గొననున్నారు.

## సర్కారు బడుల్లో అత్యాధునిక బోధన

(మొదటిపేజీ తరువాయి)



దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పేరొందిన ఈ సంస్థల భాగస్వామ్యంతో.. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, ప్రత్యేక కార్యదర్శి హరిత, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, పాఠశాల విద్య సంచాలకుడు నర్సింహారెడ్డి, త్వరలో పాఠశాల విద్య సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించనున్న నవీన్ నికోలస్, ఏక్‌స్టెప్ ఫౌండేషన్ సీవోవో జగదీశ్‌బాబు, ప్రజ్వల ఫౌండేషన్ చీఫ్ డా.సునీతా కృష్ణన్, ఫిజిక్స్ వాలా కో-ఫౌండర్ ప్రతీక్ మహేశ్వరి, ఖాన్ అకాడమీ ఇండియా ఎండీ స్వాతి వాసుదేవన్, పైజామ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు షోయబ్ దార్, ఎడ్యుకేట్ గర్ల్స్ సీఈఓ గాయత్రి నాయిర్ లోబో పాల్గొన్నారు.



## నేడు రైతులతో సీఎం ముఖాముఖి

- 1,034 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తోందని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏడాదిన్నరలోనే రైతు సంక్షేమానికి రూ.78,000 కోట్లు ఖర్చు చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, సంచాలకుడు గోపి, విశ్వవిద్యాలయ ఉప కులపతి అల్దాస్ జానయ్యలకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతునేస్తం కార్యక్రమంలో సీఎం స్వయంగా పాల్గొని రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారని, కీలక నిర్ణయాలు వెల్లడిస్తారని చెప్పారు. గత ఏడాది మార్చి నుంచి నిర్వహిస్తున్న రైతునేస్తం కార్యక్రమాల్లో ఇంతవరకు 6.35 లక్షల మంది పాల్గొన్నారన్నారు. ప్రస్తుతం 566 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఉండగా.. సోమవారం మరో 1,034 వేదికల్లో ఈ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు జరిగే సీఎం ముఖాముఖికి 1,500 మంది రైతులు హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని 1,600 రైతు వేదికల్లో ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

# గోదావరి-బనకచర్లతో తీవ్ర నష్టం

- వెంటనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు కేంద్రాన్ని డిమాండ్ చేయాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హరీశ్‌రావు లేఖ



**హైదరాబాద్:** గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టు వల్ల గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులకు తీవ్ర నష్టం కలుగుతుందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ తీసుకుంటున్న చర్యలు రాష్ట్ర పునర్విభజన చట్టం-2014తోపాటు నదీ జలాల బోర్డుల నియమాలను ఉల్లంఘించడమేనన్నారు. వెంటనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలంటూ కేంద్రాన్ని కోరాలని ఆయన సూచించారు. ఈమేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆదివారం హరీశ్‌రావు లేఖ రాశారు. "200 టీఎంసీల గోదావరి నీటిని బనకచర్ల వరకు తరలించేందుకు మూడు దశల్లో ప్రాజెక్టు డిజైన్, కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీఎఫ్ఆర్ సమర్పించడమ ంటే.. తెలంగాణ నీటి హక్కులను కాలరాయడమే. 2025 జూన్ 13న కేంద్ర జలశక్తి మంత్రికి లేఖ రాసి ఈ ప్రాజెక్టును వ్యతిరేకించినందుకు మీకు అభినందనలు. గోదావరి జలాల్లోని 969 టీఎంసీల తెలంగాణ వాటాలో ఇప్పటివరకు వినియోగం 600 టీఎంసీలకు పెరిగింది. గోదావరిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ, సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్ వంటి బ్యారే జీలు, 19 లక్షల ఎకరాల స్థిరీకరణతో గోదావరి బేసిన్ అభివృ ద్ధి చెందింది. చెరువులు, చెక్‌డ్యాములు, మిషన్ కాకతీయ, కాల్వల ద్వారా గోదావరి నీటిని వ్యవస్థీకృతంగా వినియోగంలో కి తేవడం జరిగింది. కేంద్రం వద్ద ఇప్పటికీ కాళేశ్వరం ఎత్తిపోతల అదనపు నివేదిక, సమ్మక్కసాగర్, వార్ధా(బీఆర్ అంబేడ్కర్) ప్రాజెక్టుల డీపీఆర్‌లు పెండింగ్‌లు ఉన్నాయి. గోదావరి ట్రైబ్యునల్ అవార్డు ప్రకారం.. పోలవరం ద్వారా 80 టీఎంసీలు కృష్ణా డెల్టాకు తరలించినట్లయితే, కృష్ణా జలాల్లో తెలంగాణకు అదనంగా 157.5 టీఎంసీల వాటా హక్కుగా లభించాలి. ఈ 157.5 టీఎంసీలను నికర జలాల కేటాయింపులు లేని పాత ప్రాజెక్టులకు వాడుకునే వెసులుబాటు కలుగుతుంది. ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, పాలమూ రు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులకు వినియోగించుకోవచ్చు. బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ముందు తెలంగాణకు 157.5 టీఎంసీల అదనపు వాటాను కోరాలి. రాష్ట్ర నీటి హక్కుల సాధనపై మీకు భారాస తోడుగా నిలుస్తుంది" అని లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు.

## నేడు మంత్రులతో సీఎం భేటీ

### రైతుభరోసా సహా పలు అంశాలపై చర్చించే అవకాశం



**హైదరాబాద్:** మంత్రివర్గ సహచరులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ కానున్నారు. ఇది క్యాబినెట్ సమావేశం కాకపోయినా.. మంత్రులందర్నీ సమావేశానికి ఆహ్వానించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నారు. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారు. ఈ నెల 25 వరకూ ఈ ప్రక్రియ కొనసాగనున్నట్లు సమాచారం. దీనిపై మంత్రివర్గ సహచరులతో సీఎం చర్చించనున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు మంజూరైన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయడం.. కొత్తగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలను పరిశీలించి, ప్రాధాన్యపరంగా దీనికి ముందుగా అనుమతి ఇవ్వాలనే దానిపైనా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ అంశంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపకమిటీ చర్చిస్తోంది. మంత్రులతో సమావేశంలో ఆర్ఆర్ఆర్ పనులపైనా చర్చించే అవకాశం ఉంది. ప్రధానంగా దక్షిణ భాగం పనులపై ఓ అభిప్రాయానికి రానున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా భూసేకరణ, పరిహారం అంశాలు ఈ సమావేశంలో చర్చకు రానున్నట్లు తెలిసింది.

### స్థానిక సంస్థల ఎన్నికలపైనా చర్చ

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ఎన్నికలపైనా మంత్రులతో చర్చించే అవకాశాలున్నాయి. ప్రభుత్వం అనుమతిస్తే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్రంలోని 12,769 పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు జరిగాయి. గతేడాది ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీకాలం ముగిసింది. 539 జడ్పీటీసీ, 5,817 ఎంపీటీసీ స్థానాలకు 2019 మే నెలలో ఎన్నికలు జరిగాయి. మండల పరిషత్‌లతోపాటు 28 జిల్లా పరిషత్ పాలకవర్గాల గడువు 2024 జులై 5వ తేదీతో ముగియగా.. ములుగు, ఖమ్మం, భద్రాచలం, మహబూబాబాద్ జడ్పీలతోపాటు ఆ నాలుగు జిల్లాల్లోని మండల పరిషత్ పాలకవర్గాల గడువు 2024 ఆగస్టు 5తో ముగిసింది. రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లు, 118 మున్సిపాలిటీలకు 2020లో ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం కూడా గత జనవరి 26న ముగిసింది. గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడానికి ముందే సర్పంచి, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, పురపాలక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఓటర్ల జాబితాలను సిద్ధం చేసింది. బ్యాలెట్ బాక్సులను సమకూర్చుకుంది. ఎన్నికల సిబ్బందిని ఎంపిక చేసి, శిక్షణ ఇచ్చింది. పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసింది. అయితే, పాలకవర్గాల పదవీకాలం ముగిసినా ఎన్నికలు జరగకపోవడంతో ఇన్‌ఛార్జుల పాలన మొదలైంది. ఆ తర్వాత నగరపాలక, పురపాలక సంఘాల్లో పలు గ్రామపంచాయతీల విలీనం, కొత్త పురపాలికల ఏర్పాటు నేపథ్యంలో వాటిని సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల నుంచి మినహాయించింది. అక్కడి ఓటర్లను కొత్త నగరపాలికలు, పురపాలికల్లోని ఓటరు జాబితాల్లో చేర్చింది. ఓటర్ల జాబితాల్లో, పోలింగ్ కేంద్రాల్లోనూ మార్పులను గత మార్చి నాటికి పూర్తి చేసింది. ఎన్నికల గుర్తుల జాబితానూ విడుదల చేసింది.

# కేదార్‌నాథ్‌లో కూలిన హెలికాప్టర్



### పైలట్, ఆరుగురు యాత్రికుల దుర్మరణం

**రుద్రప్రయాగ్:** గగనంలో మరో విషాదం. 241 మంది ప్రయాణికులను బలిగొన్న ఎయిరిండియా విమాన ప్రమాద ఘటననింకా మరువకముందే, ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయానికి యాత్రికులను తీసుకెళుతున్న హెలికాప్టర్ గౌరీకుండ్ అడవుల్లో ఆదివారం కుప్పకూలింది. ఈ ఘటనలో పైలట్ సహా మరో ఆరుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో రెండేళ్ల చిన్నారి కూడా ఉంది. ప్రతికూల వాతావరణమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఆర్యన్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన బెల్-407 హెలికాప్టర్ గౌరీకుండ్, కేదార్‌ఘాటీలోని త్రిజుగినారాయణ్ మధ్య కూలిపోయిందని, మంటలు రాజుకొని హెలికాప్టర్‌లో ఉన్నవారంతా మృతి చెందారని అధికారులు తెలిపారు. ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తు నిర్వహిస్తుందని పౌర విమానయాన మంత్రిత్వశాఖ పేర్కొంది. "ఐదుగురు ప్రయాణికులు, ఓ చిన్నారి, ఓ పైలట్ హెలికాప్టర్‌లో ఉన్నారు. ఉదయం 5.10 గంటలకు గుప్తకాశీ నుంచి బయల్దేరిన హెలికాప్టర్ 5.18 గంటలకు శ్రీకేదార్‌నాథ్‌జీ హెలిప్యాడ్ దగ్గర దిగింది. అక్కడి నుంచి మళ్లీ 5.19 గంటలకు గుప్తకాశీ తిరిగి వెళ్లేందుకు బయల్దేరింది. ఆ సమయంలోనే గౌరీకుండ్ దగ్గర కూలిపోయింది" అని అధికారిక ప్రకటనలో వెల్లడించింది. దీంతో చార్‌ధామ్ క్షేత్రాలైన కేదార్‌నాథ్, బద్రీనాథ్, యమునోత్రి, గంగోత్రికి వెళ్లే హెలికాప్టర్ల సేవల సంఖ్యను తగ్గించినట్లు పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ఒక ప్రకటనలో పేర్కొంది. చార్‌ధామ్ యాత్ర మార్గంలో రెండు రోజుల పాటు హెలికాప్టర్ సేవలను నిలిపివేస్తున్నట్లు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. ఘటనపై దర్యాప్తునకు ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన రాజ్‌వీర్ సింగ్ చౌహాన్‌కు పైలట్‌గా 15 ఏళ్లకు పైగా అనుభవం ఉంది.



## ప్రాణాలు ఎలాగూ మిగల్లేదు..
### కనీసం మృతదేహాలైనా ఇవ్వండి

**అహ్మదాబాద్ :** అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాద ఘటనలో సజీవ దహనమైన వారి మృతదేహాలను గుర్తించడం కష్టతరమవుతోంది. శరీరాలు ఛిద్రమైపోవడంతో అవి ఎవరివో తేల్చడం కత్తిమీద సాములా మారింది. ప్రతి శరీరభాగానికి డీఎన్ఏ టెస్టులు చేయాల్సి రావడంతో ఎక్కువ సమయం తీసుకుంటోంది. మరోవైపు మాంసపు ముద్దలు ఇచ్చి.. 'ఇవి మీ వారివే' అని వైద్యులు చెబుతుంటే.. బంధువులు అంగీకరించలేకపోతున్నారు. ఒకట్రెండు ముక్కలు కాకుండా పూర్తి మృతదేహాలను అప్పగిస్తే అంత్యక్రియలైనా గౌరవంగా నిర్వహించుకుంటామంటూ వారు పడుతున్న ఆవేదన గుండెల్ని మెలిపెడుతోంది. డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్న అహ్మదాబాద్‌లోని సివిల్ ఆస్పత్రిలోని శవాగారం వద్ద.. మృతదేహాన్ని తీసుకొచ్చే సంచీలో రెండు తలలు ఉండటం వివాదానికి తావిచ్చింది. అప్రమత్తమైన వైద్యాధికారులు వెంటనే మరోసారి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. తన కుటుంబ సభ్యుల అవశేషాలన్నీ అప్పగించమని ఓ వ్యక్తి అధికారులను వేడుకున్నారు. అయితే, అది సాధ్యం కాదని అతి కష్టం మీద ఆయనను అధికారులు ఒప్పించారు. కష్టమని తెలిసినా.. ఆత్మీయులను కోల్పోయిన బాధలో బాధిత కుటుంబీకులు వైద్యులను ప్రాధేయపడుతున్న తీరు కన్నీరు తెప్పిస్తోంది. ఓ వైపు కుటుంబీకులను కోల్పోయామన్న బాధ, మరోవైపు కనీసం వారి మృతదేహాలను కూడా ఇంటికి తీసుకెళ్లలేకపోతున్నామన్న ఆవేదనతో ఆస్పత్రి ఆవరణలో పరిస్థితి హృదయవిదారకంగా మారింది. విమాన ప్రమాదంలో మృతి చెందినవారి మృతదేహాలను అహ్మదాబాద్‌లోని 1200 పడకల సివిల్ ఆస్పత్రిలో భద్రపరిచారు. రక్తసంబంధీకుల నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించి, మృతదేహాల నమూనాలతో సరిపోల్చి.. బంధువులకు అప్పగిస్తున్నారు. ఇప్పటి వరకు 14 మంది మృతుల డీఎన్ఏను వారి కుటుంబ సభ్యుల జన్యు పరీక్షలతో సరిపోలినట్లు అధికారులు వెల్లడించారు. డీఎన్ఏ పరీక్షతో పనిలేకుండా బంధువులు గుర్తుపట్టిన 8 మృతదేహాలను ఇప్పటికే వారి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. వీలైనంత వరకు మిగతా మృతుల డీఎన్ఏను గుర్తించేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బాధితుల కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి 230 బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.





## ఎయిరిండియా ప్రమాద ఘటన..
### విజయ్ రూపాణీ మృతదేహం గుర్తింపు

**అహ్మదాబాద్:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ నెల 12న జరిగిన ఘోర విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం, భాజపా సీనియర్ నేత విజయ్ రూపాణీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటన జరిగిన మూడు రోజుల అనంతరం ఆయన మృతదేహాన్ని గుర్తించినట్లు గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘ్వీ వెల్లడించారు. రూపాణీ కుటుంబ సభ్యుల నమూనాలతో మృతదేహం డీఎన్ఏ సరిపోలిందన్నారు. దీంతో భౌతికకాయాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. ఇప్పటిదాకా 32 మంది మృతుల డీఎన్ఏ వారి కుటుంబసభ్యుల జన్యు పరీక్షలతో సరిపోలినట్లు బీజే వైద్య కళాశాల సీనియర్ ప్రభుత్వ వైద్యుడు తెలిపారు. డీఎన్ఏ పరీక్ష నిర్వహించి.. ఇప్పటి వరకు 14 మంది మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. పరీక్షతో పనిలేకుండా బంధువులు గుర్తుపట్టిన 8 మృతదేహాలను ఇప్పటికే వారి కుటుంబసభ్యులకు ఇచ్చారు. ప్రమాద తీవ్రత వల్ల చాలా వరకు గుర్తుపట్టలేని విధంగా కాలిపోవడంతో డీఎన్ఏ టెస్టులు నిర్వహిస్తున్నామ న్నారు. ఒక్కో పరీక్షకు ఎక్కువ సమయం పడుతుండడం గుర్తింపు ఆలస్యం అవుతోందని తెలిపారు. బాధితుల కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి 230 బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన 11 మంది విదేశీయుల కుటుంబాలను ఇప్పటికే సంప్రదించామన్నారు.



### ఎఫ్-35 ఫైటర్ జెట్
## కేరళలో అత్యవసర ల్యాండింగ్

బ్రిటన్‌కు చెందిన ఎఫ్-35బీ రకం యుద్ధ విమానం కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేసింది. హిందూ మహాసముద్రం పై ప్రయాణిస్తున్న సమయంలో అందులో ఇంధనం తగ్గిపోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది. ఈ ఘటన శనివారం రాత్రి చోటు చేసుకొంది. ఐదో తరానికి చెందిన ఈ స్టెల్త్ ఫైటర్ జెట్.. యూకేకు చెందిన 'హెచ్‌ఎమ్‌ఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్' క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌లో భాగం. ఇది ప్రస్తుతం ఇండో-పసిఫిక్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తోంది. ఇటీవల భారత నావికాదళంతో కలిసి యుద్ధ విన్యాసాలు కూడా చేసింది. ఎఫ్-35బీ జెట్ ఈ ప్రాంతంలో ల్యాండింగ్ కావడం అరుదైన ఘటనేగానీ అసాధారణం కాదని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాకపోతే హెచ్‌ఎమ్‌ఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్‌పై ఇది ల్యాండింగ్ ఎందుకు చేయలేకపోయిందనే తెలియరాలేదు. కానీ, ఆ నౌక చుట్టుపక్కల వాతావరణం అనుకూలించకపోవడమే దీనికి కారణమై ఉండొచ్చు. ఎఫ్-35బీ వేరియంట్.. షార్ట్ టేకాఫ్ లేదా వర్టికల్ ల్యాండింగ్ కోసం రూపొందించారు. విమాన వాహక నౌకల పై పని చేసేందుకు వీలుగా ఉంటుంది. దీని స్టెల్త్ సామర్థ్యం, ఎలక్ట్రానిక్ వార్ఫేర్ సిస్టమ్స్, డేటా షేరింగ్ మౌలిక సదుపాయాల కారణంగానే ఇది అమెరికా, యూకే, ఇజ్రాయెల్, నాటో వైమానిక దళాల్లో అత్యంత కీలకమైందిగా మారింది. అయితే.. ఈ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై ఇప్పటి వరకు యూకే రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి అధికార ప్రకటన వెలువడలేదు.

## కనీవినీ ఎరుగని స్థాయిలో ప్రతిస్పందిస్తాం
### ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్:** ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న భీకర దాడుల్లో అమెరికా ప్రమేయం లేదని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. అయినా లెక్కచేయకుండా అమెరికాపై దాడికి తెగబడితే ..తమ సాయుధ దళాలు మునుపెన్నడూ కనీవినీ ఎరుగని స్థాయిలో.. టెహ్రాన్‌పై విరుచుకుపడతాయని హెచ్చరించారు. ఇరాన్ ఏ రూపంలో దాడి చేసినా తాము పూర్తి శక్తితో వాటిని తిప్పి కొడతామన్నారు. టెహ్రాన్-టెల్ అవీవ్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడం తనకు చాలా ఈజీ అని ట్రంప్ పేర్కొన్నారు. తాను తలుచుకుంటే ఈ సంఘర్షణను వెంటనే ముగించగలనని తెలిపారు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ పూర్తిగా నాశనం అవ్వకముందే తమతో అణు ఒప్పందం చేసుకోవాలని ట్రంప్ ఇప్పటికే టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఈ మారణ హోమం ఇలాగే కొనసాగితే ఇరాన్‌లో ఏమీ మిగలదన్నారు. ఒకప్పుడు ఇరానియన్ సామ్రాజ్యంగా పేరొందిన దేశాన్ని కాపాడుకోవాలంటే అక్కడి పాలకులు ముందుకు రావాలని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అగ్రరాజ్యంతో చర్చలు అర్థరహితమని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టంచేశారు. ఒకవైపు తమపై దాడులకు మద్దతునిస్తూ.. మరోవైపు అణు ఒప్పందంపై చర్చలకు ఆహ్వానించడం సరికాదని అన్నారు. తాము ఇజ్రాయెల్‌పై చేస్తున్న దాడులను ఆపడానికి అమెరికా, యూకే, ఫ్రాన్స్ వంటి దేశాలు ఇజ్రాయెల్‌కు సహకరిస్తే ఆయా దేశాలకు చెందిన స్థావరాలపై దాడులు చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. కొద్ది రోజులుగా ఇరాన్, అమెరికా మధ్య అణుఒప్పందం కోసం ఒమన్ మధ్యవర్తిత్వంలో చర్చలు జరుగుతున్నాయి. దీనిపై ఇప్పటివరకు ఇరుదేశాల మధ్య 5 భేటీలు జరిగినప్పటికీ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో ఒమన్‌లో ఆదివారం జరగాల్సిన ఆరో విడత చర్చలను రద్దు చేసుకున్నారు.

## నదిలో కూలిన వంతెన..
### అనేక మంది గల్లంతు



**పుణె :** పుణెలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇంద్రాయణి నదిపై ఉన్న ఓ వంతెన కుప్పకూలింది. ఈ ఘటనలో అనేక మంది పర్యటకులు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఆరుగురిని స్థానికులు రక్షించినట్లు సమాచారం. మిగతావారి కోసం గాలింపు కొనసాగుతోంది. పుణె జిల్లాలోని ఇంద్రాయణి నదిపై కుందమాలా పర్యాటక ప్రాంతానికి ఆదివారం పర్యటకులు పోటెత్తారు. అక్కడున్న ఇనుప వంతెనపై అనేక మంది వచ్చి నిలబడిన క్రమంలోనే కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో అనేక మంది నదిలో కొట్టుకుపోయారు. వెంటనే రంగంలోకి దిగిన స్థానిక పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. పలువురిని రక్షించినప్పటికీ.. అనేక మంది జాడ తెలియరాలేదు. ఇంద్రాయణి నదిపై ఈ ఇనుప వంతెనను 30 ఏళ్ల క్రితం నిర్మించినట్లు స్థానిక ఎమ్మెల్యే వెల్లడించారు. ఇది కేవలం కాలినడక మార్గమే. ప్రమాద సమయంలో వంతెనపై దాదాపు 100 మంది ఉన్నారని, అందులో అనేక మంది ఒడ్డుకు చేరుకున్నప్పటికీ పలువురు గల్లంతయ్యారని చెప్పారు. ఇదిలాఉంటే, మహారాష్ట్రలో అనేక ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పుణెతోపాటు, పింప్రీ చించ్వాడ్ ప్రాంతాలకు వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

### అందుకే.. ఆ వంతెన కూలిపోయింది: అజిత్ పవార్

పుణె: మహారాష్ట్రలోని ఇంద్రాయణి నదిపై వంతెన కూలిపోయిన ఘటనపై రాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ స్పందించారు. వంతెన కూలిపోవడానికి గల కారణాలు తెలిపారు. ఏళ్ల కిందట నిర్మించిన ఈ ఇనుప వంతెన తుప్పు పట్టడం వల్లే కూలిపోయిందని అన్నారు. మరోవైపు, ఈ ఘటనపై సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ప్రమాదంపై విచారణ వ్యక్తం చేశారు. గల్లంతైన వారి ఆచూకీ గుర్తించేందుకు సంబంధిత సహాయక బృందం చర్యలు కొనసాగిస్తోందని తెలిపారు. కాగా.. ఇంద్రాయణి నదిపై కుందమాలా పర్యాటక ప్రాంతానికి ఆదివారం పర్యటకులు అధిక సంఖ్యలో వచ్చారు. అక్కడున్న ఇనుప వంతెనపై అనేక మంది వచ్చి నిలబడిన క్రమంలోనే కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో అనేక మంది పర్యటకులు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

## కొనసాగుతున్న డీఎన్ఏ పరీక్షలు..
### 47 మృతదేహాలు గుర్తింపు



**అహ్మదాబాద్ :** అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు కొనసాగుతున్నాయి. బాధిత కుటుంబ సభ్యుల డీఎన్ఏ నమూనాతో పోల్చి చూసే ప్రక్రియ మూడు రోజులుగా కొనసాగుతోంది. ఇప్పటివరకు 47 మందిని గుర్తించగా.. 24 మృతదేహాలను వారి కుటుంబీకులకు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందినవారే ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. విమానంలో మొత్తం 242 మందికిగాను 241 మంది చనిపోయారు. వీరితోపాటు 29 మంది వైద్య విద్యార్థులు, స్థానికులు ప్రాణాలు కోల్పోగా.. అనేక మృతదేహాలు గుర్తుపట్టకుండా కాలిపోయాయి. దీంతో డీఎన్ఏ పరీక్షలు అనివార్యమయ్యాయి. ఈ ప్రక్రియ సుదీర్ఘ సమయం పడుతుండటంతో బాధిత కుటుంబాలు వేచిచూస్తున్నారు. విమాన ప్రమాద ఘటనా ప్రదేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా పరిశీలించారు. అనంతరం చికిత్స తీసుకుంటున్న బాధితులు, వారి కుటుంబీకులను పరామర్శించారు. వారికి అందుతున్న సాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలను రాష్ట్ర అధికారులు ఆయనకు వివరించారు.

## యుద్ధం కోసం కుమారుడి పెళ్లి వాయిదా
### ఇజ్రాయెల్ ప్రధాని కీలక నిర్ణయం



**ఇజ్రాయెల్ :** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య పరస్పర దాడులతో పశ్చిమాసియా రగిలిపోతోంది. ఐడీఎఫ్ దళాలు అటు గాజా.. ఇటు ఇరాన్‌పై వరుస దాడులు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన కుమారుడి వివాహం విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ వివాహ వేడుకను వాయిదా వేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. నెతన్యాహు కుమారుడు అవ్‌నర్, అమిత్ యార్దేనీకి మరికొన్ని రోజుల్లో విహహం జరగనుంది. ఈ వేడుకను వైభవంగా నిర్వహించేందుకు ఆయన కుటుంబం సిద్ధమైంది. కానీ, ఇరాన్‌లో సైనిక స్థావరాలు, అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఐడీఎఫ్ దళాలు దాడులు నిర్వహించాయి. వీటికి ప్రతీకారంగా ఇరాన్ కూడా తిరిగి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. పశ్చిమాసియాలో చోటు చేసుకుంటున్న ఈ పరిణామాల మధ్య నెతన్యాహు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందని కథనాలు పేర్కొన్నాయి. గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న నాటి నుంచే నెతన్యాహు కుమారుడి వివాహ అంశం వివాదస్పదంగా మారింది. అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే.. ఆయన ఇంట వేడుకలు నిర్వహిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ఆయన ఈ వేడుకను వాయిదా వేయడానికి ఇది కారణమై ఉండొచ్చని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా.. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య దాడులు మరింత ముదురుతున్నాయి. ఫ్రాన్‌లోని ఇరాన్ అణ్వాయుధ ప్రాజెక్టుపై దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఈమేరకు ఐడీఎఫ్ 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసింది. ఇరాన్‌కు చెందిన మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ హెడ్‌క్వార్టర్స్, ఎస్‌పీఎన్‌డీ న్యూక్లియర్ ప్రాజెక్టు హెడ్ క్వార్టర్స్‌పై దాడులు చేసినట్లు అందులో పేర్కొంది. ఇజ్రాయెల్‌లోని పలు నగరాల్లో సైరన్ల మోతతో లక్షల మంది ప్రజలు షెల్టర్లలో తలదాచుకొన్నట్లు వివరించింది. ఇజ్రాయెల్‌పై అత్యాధునిక క్షిపణిని ప్రయోగించామని తాజాగా ఇరాన్ ప్రకటించింది.




## ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం.. రన్‌వేపై గంట ఆలస్యం

**ఉత్తరప్రదేశ్ :** ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానం రన్‌వేపైనే ఉండాల్సి వచ్చింది. ఈ కారణంగా ప్రయాణం గంట సేపు ఆలస్యం కానుంది. ఈ ఘటనపై సదరు సంస్థ స్పందించింది. వివరాల్లోకి వెళితే.. ఎయిరిండియా విమానం ఐఎక్స్ 1511 ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ విమానాశ్రయం నుంచి పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాకు బయలుదేరాల్సి ఉంది. టేకాఫ్‌కు కాసేపటికి ముందు విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని వెంటనే గుర్తించిన సంస్థ అప్రమత్తమైంది. దీంతో విమాన ప్రయాణాన్ని నిలిపివేసింది. గంట ఆలస్యంగా బయలుదేరనుందని తెలిపింది. ఈ ఘటనపై ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి ఒకరు స్పందించారు. "టేకాఫ్‌కి కాసేపు ముందే సాంకేతిక లోపాన్ని గుర్తించాం. ఆలస్యం కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. వారికి రీషెడ్యూల్ లేదా రీఫండ్ చేసేందుకు సంస్థ సిద్ధంగా ఉంది" అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా.. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా ఫ్లయిట్ నెంబర్ ఏఐ-171 విమానం ఇటీవల కూలిపోయిన సంగతి తెలిసిందే. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రమాదానికి గురైంది. మేఘానినగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలో విమానం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో 274 మంది మృతి చెందారు. అయితే.. ఈ ప్రమాదంపై స్వయంగా దర్యాప్తు చేపట్టేందుకు ఎయిరిండియా సిద్ధమైంది. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర తనిఖీలు చేపడుతోంది. ఈ క్రమంలోనే మరో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో తలెత్తిన సాంకేతిక లోపాన్ని గుర్తించారు.



## ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ ఉత్పత్తి కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి..

**ఇరాన్ :** పశ్చిమాసియా ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య దాడులు కొనసాగుతున్నాయి. టెహ్రాన్ ప్రధాన ఆర్థిక జీవనాడి అయిన ది సౌత్ పార్స్ క్షేత్రంపై దాడి చేసింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ క్షేత్రం. టెహ్రాన్‌లోని ఇరాన్ అణు కేంద్రాలు సహా 150కి పైగా లక్ష్యాలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఇరాన్ చమురు మంత్రిత్వ శాఖ అధికారులు మీడియాతో మాట్లాడుతూ.. టెల్‌అవీవ్ దాడుల్లో షహ్రాన్‌లోని భారీ గ్యాస్ క్షేత్రం కూడా ధ్వంసమయినట్లు తెలిపారు. 11 నిల్వ ట్యాంకులు ఒకదాని తర్వాత ఒకటి పేలిపోతుండడంతో భారీగా అగ్నికీలలు ఎగసిపడుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల సమీప నివాస ప్రాంతాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. గ్యాస్ క్షేత్రాలపై దాడి ఆ దేశ ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య దాడులు కొనసాగుతున్నాయి. తాజా దాడుల్లో ఇజ్రాయెల్ క్షిపణి ఓ నివాస భవనాన్ని లక్ష్యంగా చేసుకోవడంతో 29 మంది పిల్లలతో సహా 60 మంది మరణించినట్లు ఇరాన్ అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్‌లోని గలిలీ ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్ భవనంపై టెహ్రాన్ చేసిన ప్రతిదాడుల్లో నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. శనివారం ఇరుదేశాలు పరస్పరం దాడులకు పాల్పడ్డాయి. టెహ్రాన్ లక్ష్యంగా యుద్ధ విమానాలు, మిస్సైళ్లతో ఇజ్రాయెల్ విరుచుకుపడగా... టెల్ అవీవ్‌పై ఇరాన్ అయిదు విడతల్లో వందల క్షిపణులను ప్రయోగించింది. రెండో రోజు ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌లోని పలు కీలక స్థావరాలు సహా నతాంజ్ అణు కేంద్ర ఉపరితల భాగం ధ్వంసమైంది. నేలమాళిగలో ఉన్న ఈ అణు శుద్ధి కేంద్రం ఇరాన్‌కు అత్యంత కీలకమైనది. టెహ్రాన్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫోర్డో అణుశుద్ధి కేంద్రంలోనూ పేలుళ్లు సంభవించాయి.

## ఇరాన్ వాసులు ఆ ప్రాంతాలను ఖాళీ చేయండి : ఇజ్రాయెల్

**ఇరాన్ :** ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం తీవ్రత మరింత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో టెల్‌అవీవ్ నుంచి ఓ హెచ్చరిక జారీ అయింది. ఇరాన్ ఆయుధ తయారీ కర్మాగారాల సమీపంలో నివశించే పౌరులు తక్షణమే ఆ ప్రదేశాలను ఖాళీ చేయాలని ఎక్స్‌లో పోస్టు చేసింది. దీంతో మరోమారు ఇజ్రాయెల్ తీవ్ర స్థాయిలో దాడులు నిర్వహించే అవకాశాలున్నాయి. "మీ భద్రత కోసం ఇది. దయచేసి ఆయుధ తయారీ కేంద్రాల సమీపంలో నివశించేవారు ఆ ప్రదేశాలను తక్షణమే ఖాళీ చేయండి. మళ్లీ చెప్పే వరకు ఆ ప్రదేశాల వద్దకు రావొద్దు. ఇక్కడ ఉండటం మీకు ప్రమాదకరం" అని ఐడీఎఫ్ అరబిక్ ప్రతినిధి పేర్కొన్నారు. దీంతో పాటు ఆయుధ తయారీకి సహకరించే కేంద్రాల సమీపం నుంచి కూడా పౌరులు వెళ్లిపోవాలని కోరారు. మరోవైపు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఖట్జ్ ఈ ఆదేశాలను ధ్రువీకరించారు. టెహ్రాన్‌లో ప్రజలను ఖాళీ చేయించేందుకు ఐడీఎఫ్ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. " ఐడీఎఫ్ ఆ ప్రదేశాలపై దాడులు చేస్తుంది. టెహ్రాన్ సహా ఎక్కడైతే ఆయుధాలున్నాయో అన్ని చోట్ల దాడులు జరుగుతాయి." అని పేర్కొన్నారు.

### అండర్ గ్రౌండ్ పార్కింగ్‌లకు ప్రజలు..

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో బాంబు షెల్టర్లు లేకపోవడంతో.. ప్రజలు అండర్ గ్రౌండ్ పార్కింగ్‌లు, టన్నెల్స్, బేస్‌మెంట్లలో ఉండాలని నగర కౌన్సిల్ ఛైర్మన్ మెహది చమ్రాన్ సూచించారు. "దురదృష్ట వశాత్తు మా నగరంతో సహా ఎక్కడా షెల్టర్లు లేవు. వీటి నిర్మాణంపై ఇప్పుడు మేము కచ్చితంగా పనిచేయాలి" అని పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ పార్కింగ్‌లను వీటి కోసం సిద్ధం చేయాల్సి ఉందన్నారు.

www.rajamudranews.com
రాజముద్ర
తెలుగు దిన పత్రిక



## రజకులకు పెండింగ్ లో ఉన్న విద్యుత్ బకాయిలు చెల్లించాలి

### జూన్ 17న ఛలో ఇందిరాపార్క్ ధర్నా ను జయప్రదం చేయండి

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** గత ప్రభుత్వం రాష్ట్రంలోని రజకులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తే నేడు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ఉన్న సర్కారు గత పదిహేను నెలలుగా బకాయిలు చెల్లించడం లేదని అందుకే ఈ నెల 17న నగరంలోని ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని రజక వృత్తి దారుల సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం చెంగిచెర్ల లో ధర్నాకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా రజక వృత్తి దారుల సంఘం మేడ్చల్ జిల్లా గౌరవ అధ్యక్షులు అంబే చక్రపాణి మాట్లాడుతూ... కులవృత్తులను ఆర్థికంగా ఆదుకునేందుకు గాను గత ప్రభుత్వం రజక వృత్తి దారులకు ఉచిత విద్యుత్ అందించారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత పదిహేను నెలల నుండి విద్యుత్ చార్జీలు చెల్లించడం లేదని దాంతో విద్యుత్ అధికారులు వృత్తి దారులపై వత్తిడి తెస్తున్నారని కొన్ని చోట్ల బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. రజకుల సమస్యలపై ఈ నెల 17 న ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని అ ధర్నాకు రజకులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల అద్యక్షుడు అంబే శ్రీనివాస్, చెంగిచెర్ల కార్యదర్శి, అంబే కృష్ణ, ఎ నరసింహ, యాదయ్య, మల్లేష్, చందర్, రమేష్, నవీన్ కుమార్, కోశాధికారి మహేష్, రాజు, రమేష్, లక్ష్మి, పద్మ, స్నేహ, నాగరాణి, గోకుల్, కవిత, నాగమణి, పల్లవి, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.



# తడి చెత్త-పొడి చెత్తపై అవగాహన

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడిగె కృష్ణ గౌడ్

### మల్లికార్జున నగర్ ఫేజ్-1లో ప్రజల భాగస్వామ్యంతో విస్తృత ప్రచారం

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పరిసరాల పరిశుభ్రతకు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందిస్తూ ప్రజలందరూ తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలని పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడిగె కృష్ణ గౌడ్ తెలిపారు. ఈ మేరకు పీర్జాదిగూడ నగర పరిధిలోని 5వ డివిజన్ మల్లికార్జున నగర్ ఫేజ్ 1 లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేయి విధానం కంపోస్టు ఎరువు తయారు చేయడం పై అవగాహన కల్పించేందుకు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజల భాగస్వామ్యంతోనే శుభ్రమైన, ఆరోగ్యకరమైన పీర్జాదిగూడను నిర్మించగలమని పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుండి వచ్చే తడి చెత్తను, పొడి చెత్తను, హానికారిక చెత్తను విధిగా వేరు చేసి చెత్త సేకరణ వారికి అందించాలని కోరారు. ఈ విధంగా చెత్తను వేరు చేయడం వలన వాటి నుండి పలు రకాలైన కంపోస్టు ఎరువులను తయారు చేసేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అంతేకాకుండా పరిసరాల పరిశుభ్రతకు పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేస్తూ ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేదించాలని కోరారు. దుకాణాలకు వెళ్లినప్పుడు విధిగా జ్యూట్ బ్యాగులను, క్లాత్ బ్యాగులను లేదా 50 మైక్రాన్ల కంటే మందంగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను తీసుకెళ్లాలని సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. నీరు నిల్వ ఉన్నట్లయితే వాటిపై దోమలు వాలి డెంగ్యూ మలేరియా విషజ్వరాలు సోకే ప్రమాదం ఉందని అన్నారు. ఇంటింటికి కరపత్రాలను పంచుతూ ప్రజలందరికి తడి చెత్త పొడి చెత్తపై అవగాహన కల్పిస్తూ కంపోస్టు ఎరువును ఏ విధంగా తయారు చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, ప్రజలు, మహిళా మణులు, మున్సిపల్ సిబ్బంది కీర్తన, వార్డ్ ఆఫీసర్ అతిక్ తదితరులు పాల్గొన్నారు.





### పీర్జాదిగూడ నగర పరిధిలోని 5వ డివిజన్

పర్వతాపూర్ పోచమ్మ కుంట వద్ద జరుగుతున్న వరద ముంపు నుండి శాశ్వత పరిష్కారంలో భాగంగా ఎస్ ఎన్ డి పి పనులను స్థానిక ప్రజలతో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడిగె కృష్ణ గౌడ్ పరిశీలించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాంట్రాక్టర్, వార్డ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

– పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్

## ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపె 24న ఎంపీడీవో కార్యాలయ ముట్టడి



### - సిపిఎం పిలుపు

**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్ల లబ్ధిదారులను గుర్తించే విషయంలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ వాస్తవ లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఎంపీడీవో కార్యాలయ ముట్టడిని నిర్వహించడం జరుగుతుందని ఈ ధర్నాలో మండల వ్యాప్తంగా రాజకీయాల కతీతంగా ఇండ్లు మంజూరుకానీ పేదలందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరు బాలరాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు పిలుపునిచ్చారు. ఆదివారం పులిగిల్ల గ్రామంలో సిపిఎం మండల కమిటీ సమావేశం సీనియర్ నాయకులు చీర్క శ్రీశైలం రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న బాలరాజు,రాజయ్య స్వామి లు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఇండ్లు రాక అనేకమంది పేదలు ఎదురు చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అనేక గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తల పథకంగా మారిందని దీనివల్ల నిజమైన లబ్ధిదారులు ఇండ్లు మంజూరు కాక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం పునరాఆలోచన చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ తమ పార్టీ కార్యకర్తలకు లబ్ధి చేకూరె విధంగా వ్యవహరిం చారని ఇది సమంజసం కాదని రాజకీయ జోక్యం లేకుండా నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయా లని డిమాండ్ చేస్తూ సిపిఎం ఈనెల 24 న నిర్వహిస్తున్న ఎంపీడీవో కార్యాలయం ముట్టడికి ఇండ్లు లేని పేదలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాని వారు రాజకీయాలకతంగా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, వాకిటి వెంకటరెడ్డి, కందడి సత్తిరెడ్డి, మండల కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు, కల్యూరి ముత్యాలు, దుబ్బ లింగం తదితరులు పాల్గొన్నారు.



## వెలువర్తిలో ఉచిత కంటి వైద్య శిబిరం

**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో ఉషోదయ లేజర్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 85 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి అతి తక్కువ ఖర్చులకే అద్దాలు పంపిణీ చేస్తామని వారు తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారికి 25 వేల రూపాయల విలువ గల కంటి ఆపరేషన్లను 10 వేల రూపాయలకే చేస్తామని, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుమన్, డాక్టర్ సికిందర్, వైద్య సిబ్బంది రోమన్, రాణి, దివ్య తదితరులు పాల్గొన్నారు.



## పైళ్ల సత్తిరెడ్డి దశదినకర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోని పులిగిల్ల గ్రామానికి చెందిన పైళ్ల సత్తిరెడ్డి ఇటీవల అకాల మరణం చెందడం జరిగింది. ఆదివారం రోజున వారి దశదినకర్మ సందర్భంగా భువనగిరి మాజీ శాసన సభ్యులు పైల్ల శేఖర్ రెడ్డి హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సత్తిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ వలిగొండ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, పడమటి మమతారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ జక్కా వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బండారు ఎల్లయ్య,పైల్ల రవీందర్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ పైల్ల మల్లారెడ్డి, బుగ్గ మల్లేష్ ,పైళ్ల అంజిరెడ్డి, బొబ్బల నర్సిరెడ్డి,నక్కల నరేందర్ రెడ్డి, కొంతం రామ్ రెడ్డి, బొబ్బల కృష్ణారెడ్డి, మామిడి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ వయోధికుల వేధింపుల అవగాహన కార్యక్రమం

తెలంగాణ స్టేట్ అల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాచారంలోని హెచ్ఎంటీ నగర్ కమ్యూనిటీ హాల్ నందు జరిగిన ప్రపంచ వయోధికుల వేధింపుల అవగాహన సందర్భంగా నిర్వహించిన వయోధికుల వేధింపుల నివారణ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం,మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి, హైకోర్టు మాజీ జస్టిస్ చంద్రకుమార్, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి తదితరులు కలిసి పాల్గొనడం జరిగింది.

– నాచారం, రాజముద్ర న్యూస్



## ప్రతిష్టాత్మకమైన బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డు అందుకున్న
# కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి జిల్లా, జూన్ 15 :** హైదరాబాదులోని రాజ్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ ప్రెసిడెంట్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ చేతుల మీదుగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఎంతో ప్రతిష్టాత్మకమైన బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డు అందు కున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక కామారెడ్డి జిల్లా కలెక్టర్ కు మాత్రమే ఈ అవార్డు రావడం గమనార్హం. గత సంవత్సరంనుండి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులుగా చేసిన సేవలకు గాను ముఖ్యంగా జిల్లాలో ఎక్కువ సంఖ్యలో రక్తదాన శిబిరాలు ప్రభుత్వపరంగా నిర్వహించడం వలన ఈ ప్రత్యేక అవార్డు పొందడం జరిగింది. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో జిల్లా రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ ఎం రాజన్నతో కలిసి జిల్లా అధికారులు అందరితో రక్తదాన విషయంలో సమీక్ష జరిపేవారు. ప్రతి జిల్లా అధికారులు వారి సిబ్బంది తప్పక రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని మోటివేట్ చేయడం మూలంగా ప్రతి నెల రెండు ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది విరివిగా రక్తదానం చేసేవారు. ఇలా సేకరించిన రక్త యూనిట్లను జిల్లాలోని పేద ప్రజల ఆరోగ్య అవసరాల కొరకు వినియోగించేవారు. అవార్డును స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజల ఆరోగ్య అవసరాల దృష్ట్యా విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరించి ప్రజల ఆరోగ్య అవసరాల నిమిత్తం అందించినందుకు చేసిన కృషికిగాను గవర్నర్ అవార్డు రావడం గర్వకారణమని, జిల్లా కలెక్టర్ గా మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులుగా ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, రక్తాన్ని స్వీకరించడంలో తనతో పాటు కృషిచేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, స్టేట్ ఎంసీ మెంబర్ సంజీవరెడ్డి, ఐఆర్సిఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారులు, జిల్లా ప్రజలు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇకముందు కూడా ఈ సేవలను కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.



# ధూల్ పేటకు షెట్కారి గణేష్ మండల కమిటీ

**కామారెడ్డి జిల్లా, జూన్ 15 :** మద్నూర్ మండల కేంద్రమైన రత్ గల్లిలో ఉన్న శ్రీ షెట్కారి గణేష్ మండలి స్థాపించబడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటోంది. శ్రీ గణేష్ ఉత్సవ్ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, శ్రీ గణేష్ మండలి సభ్యులు సమావేశం నిర్వహించి 50 అడుగుల గణేష్ విగ్రహాన్ని తయారు చేయాలని నిర్ణయించుకుని ఆదివారం ధూల్‌పేటకు బయలుదేరారు. శ్రీ షెట్కారి గణేష్ మండలి 1976లో రత్ గల్లిలో స్థాపించబడింది. ఈ సంవత్సరం 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటోంది. రాబోయే గణేష్ ఉత్సవ్ కోసం 11 రోజుల పాటు ఆహార పంపిణీ కార్యక్రమాలను నిర్వహించడానికి రోజువారీ అన్నదాతల జాబితా ఇప్పటికే పూర్తయిందని గణేష్ మండలి సభ్యులు తెలిపారు. కమిటీలోని దాదాపు 20 మంది సభ్యులు ధూల్‌పేటకు బయలుదేరారు.



# ప్రజల సమస్యల పరిష్కారానికి శుభోదయం

**బీఆర్ఎస్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్**

**రాజేంద్రనగర్ :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్‌పల్లి డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ చొరవ చూపడం జరుగుతుందని పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలో నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీరామ్ నగర్, వెంకటేశ్వరా కాలనీ, నేతాజీ నగర్ బస్తీలలో తిరిగి ప్రజలు నిత్యం ఎదురుకుంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కాలనీలల్లో ఎక్కడ చూసిన మురుగు నీరు నదిని తలపించే విధంగా రోడ్లమీద ప్రవహిస్తూ ప్రజలకు రవాణా సౌకర్యానికి ఇబ్బందిగా మారిందన్నారు. అక్కడ ఉన్న మ్యానుహోల్స్ నుండే కాకుండా నివాసాల మధ్య నుండి కూడా మురుగు ప్రవహిస్తుందన్నారు. జనావాసాల మధ్యలోనే చెత్త చెదారం ఉండటంతో అంటువ్యాధులు ప్రభలే పరిస్థితులు అక్కడ నెలకొన్నాయన్నారు. ప్రజలు నడుస్తున్న మార్గాన్నే విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ దగ్గర మూడు మాసాల క్రితం కరెంటు షాక్ తో ఓ వ్యక్తి మరణించడం జరిగిందన్నారు. అయినా కానీ ఎలక్ట్రికల్ సిబ్బందికి చీమకుట్టినట్టు కూడా లేదని, ఎలక్ట్రికల్ సిబ్బంది నిర్లక్ష్యం కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుందన్నారు. ఒకవేళ కూలిపోయే స్థితిలో ఉన్న దిమ్మ కాస్త కూలిపోయి చిన్న పిల్లల మీద పడే స్థితిలో ఉందన్నారు. విద్యుత్ స్థంబాలు రోడ్ కి అడ్డుగా ఉన్నాయని,దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో సగానికి విరిగిన విద్యుత్ స్థంబాలు ఉన్నాయన్నారు. దీంతో ఎప్పుడు అవి విరిగి ప్రమాదాలు జరుగుతాయోనని ఆందోళనకు ప్రజలు గురవుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. రెక్కాడితే కానీ డొక్కా ఆడని పరిస్థిలో ఇక్కడ ఉన్న ప్రజలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పుకోడానికి ఒక్క రోజు కూలి పని మానుకొని స్థానిక ప్రజా ప్రతినిధుల ఇండ్ల దగ్గరికి వెళ్లి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదన్నారు. దీంతో డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ పార్టీ శ్రేణులతో కలిసి ఆయా బస్తీలను సందర్శించారు. తక్షణమే ఈ సమస్యలపై సంబంధిత అధికారులను కలిసి వారికి వినతి పత్రం ఇచ్చి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము యాదవ్, రాఘవేందర్ యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, రాజేష్ యాదవ్, ఎడ్ల కాడి సూర్యం, మైసి రెడ్డి, జి రాజు, జగదీష్, వెంకటరమణ, చిరంజీవి, భూదేవి, అరుణ రెడ్డి, సరిత, శ్రీకాంత్, అనిల్, మహేష్, అశోక్ కుమార్, సందీప్ గుప్తా, సునీల్, రాజు, క్రాంతి, సింహాచలం, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాపార ధోరణి తప్ప
# సామాజిక ధోరణి ఎక్కడ!

**భారతదేశం ప్రాచీన సాంప్రదాయాలకు, నియమ నిబంధనలకు నిలియంగా చెప్పుకోబడుతుంది. ప్రపంచంలోనే భారతదేశ గొప్ప ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గల దేశంగా పేరు గల దేశం. అయితే ఇది ప్రాచీన విద్యా వ్యవస్థ నుండి తరతరాలుగా విద్యార్థులకు బోధన అంశాలుగా ఉండేది. వీటితో పాటుగా విద్యార్థులలో సామాజిక విలువలు, కుటుంబ విలువలు పెంపొందించే దిశగా విద్యా వ్యవస్థ ఉండేది. అయితే ఇందులో శాస్త్రీయ విద్యా విధానంలో కూడా మానవ విలువలను పెంపొందించే బోధన పార్టీ అంశాలు ఉండేది. కానీ ఇటీవల తీసుకువచ్చిన నూతన విద్యా విధానం పాఠ్యాంశాలలో మానవ విలువలకు పెద్దగా పాఠ్యప్రణాళికలు లేకుండా వ్యాపార ధోరణి, ప్రపంచీకరణ విధానాలతో కూడిన పాఠ్యప్రణాళికలు ఉన్నట్టుగా విద్యా మేధావులు అంటున్నారు.**

ఈ ప్రపంచానికి సైన్సు ఎంత అవసరమో, సాంకేతిక విద్య కూడా అంతే అవసరం, అంతకంటే ఎక్కువ మానవ విలువలను పెంపొందించే విద్య అవసరం. మారిన కాల పరిస్థితులలో కుటుంబ నియమ నిబంధనలు పూర్తిగా తుడ్చిపెట్టుకుపోయిన సందర్భంలో భారతీయ సామాజిక విలువలను పెంపొందించే బోధన పాఠ్యాంశాలు ఎంతైనా అవసరం. ఆధునిక విద్య పేరుతో విలువలను పెంపొందించేది తీసివేసి కేవలం వ్యాపార సంబంధాలను పెంపొందించే పాఠ్యాంశాలు ప్రమాదకరంగా ఉంటాయి. ఇప్పటికైనా పాఠ్య ప్రణాళిక రూపకల్పనలో పైన పేర్కొన్న అంశాలను పరిగణలోని తీసుకొని మానవ విలువలు పెంపొందించే దిశగా విద్య బోధన ఉండే విధంగా చూడాలి.

2.ఏడవ తరగతి విద్యార్థుల కోసం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ రూపొందించిన సాంఘిక శాస్త్రం రెండో భాగం పాఠ్యాంశంలో వస్తు మార్పిడి నుంచి ద్రవ్యం వరకు, మార్కెట్లను అర్థం చేసుకుందామనే శీర్షికన ఒక అధ్యాయాన్ని చేర్చారు. గతంలో సాంఘిక శాస్త్రంలో భాగంగా చరిత్ర, భౌగోళిక శాస్త్రం, సాంఘిక రాజకీయ జీవితం, మన పర్యావరణం అనే పాఠ్యాంశాలు ఉండేవి. సాంఘిక- రాజకీయ జీవితం పాఠ్యాంశంలోనే ఆర్థిక శాస్త్రం ఒక భాగంగా ఉండేది.

2.కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన విద్యా విధానం ఆధారంగా ఎన్సీఈఆర్టీ రూపొందించిన పాఠ్య పుస్తకాలు అన్నిటిని సమూలంగా మార్చటంలో భాగంగా ఈ మూడు పాఠ్యాంశాలను కలిపి ఒకే పాఠ్యాంశంగా మార్చారు. ఫలితంగా గతంలో ఉన్న పార్టీ పుస్తకాలలో ఉన్న సవివరమైన చాలా వివరణలు ప్రస్తావనలుకు తాజా పుస్తకాలలో చోటు దొరకటం లేదు. అదే సమయంలో వర్తమానాన్ని కూడా చరిత్రలో భాగంగా చొప్పించే ప్రయత్నం జరగటంతో తాజా పాఠ్యాంశాలు విద్యార్థులకు కావాల్సిన సంపూర్ణ అవగాహనను ఇవ్వగలిగేవిగా లేవు. అక్కడక్కడా ప్రభుత్వం ఎంపిక చేసిన థీమ్స్‌కు సంబంధించి చెదురుమదురు వివరాలు మాత్రమే పూర్తి చరిత్రగా మారింది.ప్రస్తుతం రూపొందించిన పాఠ్యాంశ పుస్తకం శీర్షిక ఎక్స్ప్లోరింగ్ సొసైటీ ఇండియా అండ్ బియాండ్.

ఈ పాఠ్యాంశాలను ఐదు భాగాలుగా విభజించారు. మొదటి భాగంలో భారతదేశం ప్రపంచం, రెండో భాగంలో భూమి- ప్రజలు, మూడో భాగంలో మన సాంస్కృతిక వారసత్వం, నాలుగో భాగంలో జ్ఞాన సాంప్రదాయాలు, మన చుట్టూ ఉన్న ఆర్థిక- జీవితల గురించి బోధించనున్నారు.

### ఏడవ తరగతి సాంఘిక శాస్త్రం మొదటి భాగం..

ఇప్పటివరకు అమల్లో ఉన్న ఏడో తరగతి చరిత్ర పాఠ్యాంశం క్రీస్తు శకం ఏడో శతాబ్దం నుంచి మొదలవుతుంది. దీనికి భిన్నంగా ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం రూపొందించిన ఏడో తరగతి చరిత్ర పాఠ్యాంశం మొదటి భాగంలో క్రీస్తుపూర్వం 19వ శతాబ్దం నుంచి క్రీస్తుశకం 9వ శతాబ్దం వరకు జరిగిన చరిత్రను బోధించనున్నారు. ఇందులో



భాగంగా సంస్కృత పదాలు వాటి వివరణ గురించి కూడా విద్యార్థులకు బోధించనున్నారు.ఇప్పటి వరకు అమల్లో ఉన్న చరిత్ర పాఠ్య పుస్తకంలో మొగల్ చక్రవర్తి బాబర్ 14వ శతాబ్దపు కవి మీనాజ్ ఈ సిరాజ్ గురించిన వివరాలు ఉన్నాయి. ఈ కవి మొదటిసారిగా భారతదేశాన్ని హిందుస్థాన్, హింద్ అన్న పదాలతో ప్రస్తావించారని చరిత్ర పరిశోధకులు నిర్ధారించారు. ఈ వివరాల స్థానంలో తాజాగా విడుదల చేసిన పాఠ్యపుస్తకంలో భారతదేశాన్ని భారత్, ఇండియా అన్న పదాలతో మాత్రమే పరిచయం చేయనున్నారు.

సంవత్సరం ఆరో తరగతి పాఠ్య పుస్తకాన్ని సవరించడం కోసం జరిగిన ప్రయత్నాల్లో వెలువడిన సమాచారాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ మార్పులు జరిగాయి. ఆరో తరగతి పాఠ్య పుస్తకంలో ప్రాచీన భారత దేశాన్ని పరిపాలించిన రాజవంశాల గురించి సవివరమైన కథనాలను పాత పాఠ్యాంశంలో బోధించేవారు. ప్రస్తుతం ఆరో తరగతి చరిత్ర పాఠ్యాంశంలో ఈ అంశాలు తొలగించి ఏడవ తరగతి పాఠ్యాంశంలో భాగంగా మార్చారు.ఏడవ తరగతి విద్యార్థుల కోసం తాజాగా రూపొందించిన చరిత్ర పాఠ్యాంశంలో భారతదేశం గురించి విస్తృతంగా చర్చించారు. ఈ భాగం గుప్తుల పరిపాలన వరకు ఉన్న చరిత్రను ప్రస్తావిస్తుంది. ఏడవ తరగతి చరిత్ర బోధనలో ఇప్పటివరకు ఉపయోగిస్తున్న పాఠ్యపుస్తకంలో క్రీస్తు శకం ఏడో శతాబ్దం నుంచి 12 శతాబ్దం వరకు ఉన్న చరిత్రకు సంబంధించిన వివరాలు ఎంపిక చేసిన రాజవంశాలు గురించి లోతైన చర్చ ఉంది.

ఢిల్లీ సుల్తాన్‌లు, మొగలులకు స్థానం లేని చరిత్ర: పాఠ్యాంశం.. ఇప్పటివరకు బోధిస్తున్న ఏడవ తరగతి చరిత్ర పాఠ్య పుస్తకంలో క్రీస్తు శకం 12 శతాబ్దం నుంచి 15 శతాబ్దం వరకు ఉత్తరభారతాన్ని దక్షిణ భారతంలో కొంత భాగాన్ని పరిపాలించిన ఢిల్లీ సుల్తానుల శకం ప్రారంభం గురించిన చర్చ ఉన్నది. రాజపుత్ రాజ్యాలు పతనమై వాటి స్థానంలో ఖిల్జీలు, తుగ్లకులు, సయ్యిద్‌లు, లోడీలు భారత దేశంలో 16 శతాబ్దంలో ప్రవేశించిన మొగలుల గురించిన చారిత్రక అంశాలు పాఠ్యాంశాలుగా ఉన్నాయి. కానీ బీజేపీ ప్రభుత్వం రూపొందించిన ఏడో తరగతి చరిత్ర పాఠ్యాంశంలో ఈ ప్రస్తావనలను తొలగించారు.

### ప్రాచీన భారత రాజ్యాలు..

భారతదేశపు గతం గురించి ఉన్న భాగంలో నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. నూతన ప్రారంభం- నగరాలు రాజ్యాలు శీర్షికతో ఉన్న మొదటి అధ్యాయం కౌటిల్యుని అర్థశాస్త్రంలోని వాక్యాలతో, మొదటి సామ్రాజ్యం కూలిపోయిన రాజ్‌గిర్ పట్టణం శిథిలాలతో ప్రారంభమవుతుంది. జానపదాలు మహాజనపదాలు అన్న భావన ఆరంభాన్ని ఈ అధ్యాయంలో చర్చిస్తారు. అందులో భాగంగా గాంధార, కురు, మత్స్య, అవంతి, చెడి, కోసల, మగధ వంటి క్రీస్తుపూర్వం రెండవ సహస్రాబ్ది ముగింపు కాలం నాటి జనపదాల గురించి పరిచయం చేస్తారు. వర్ణ, కులవ్యవస్థ వేదాలలోనే ఉన్నట్టు చెప్పబడుతుంది.ఆవిర్భవించిన సామ్రాజ్యాలనే శీర్షికతో సాగే ఐదవ అధ్యాయంలో పాటలీ పుత్ర, మగధ సామ్రాజ్యం, మౌర్య సామ్రాజ్యం, గ్రీకుల దాడులు, అశోకుని పాలన వాటి అంశాలు పరిచయం చేస్తున్నారు. కౌటిల్యుడు, పాణిని వంటి ఆ కాలానికి సంబంధించిన ముఖ్యమైన మేధావులు రాజకీయ శాస్త్రవేత్తలు గురించిన పరిచయం ఈ భాగంలో ఉంటుంది.

### భూమి పవిత్రమైనదిగా ఎలా మారింది..

ఏడవ అధ్యాయంలో ప్రధానంగా గుప్తుల కాలం నాటి చరిత్రకు కేటాయించారు. మూడో శతాబ్దం నుంచి ఆరో శతాబ్దం వరకు ఉన్న కాలాన్ని ఈ పాఠ్యాంశంలో బోధిస్తున్నారు. కళలు, శాస్త్రవిజ్ఞానం, సాహిత్యం, గణితం, ఖగోళ శాస్త్రం, వైద్యశాస్త్రం, ఖనిజ వనరుల వినియోగం, భవన నిర్మాణాలతోపాటు సంస్కృత భాషలో వెలువడిన సాహిత్యం గురించి ఈ అధ్యాయంలో చర్చించారు. గుప్తుల సామ్రాజ్యం, నలంద విశ్వవిద్యాలయం, కాళిదాసు, ఆర్యభట్ట, వరాహమిహురుడు వంటి వారి గురించి విష్ణు పురాణంలోని కథనాలను ఈ అధ్యాయంలో ప్రస్థావించారు.ప్రస్తుతం తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలుగా ఉన్న ప్రాంతం పై ఆధిపత్యాన్ని సాధించిన పల్లవ సామ్రాజ్యం గురించి కూడా ఈ అధ్యాయంలో చర్చించారు. ఎన్సీఈఆర్టీ కరిక్యులం ఏరియా గ్రూప్ ఎకనామిక్స్ విభాగం రూపొందించిన ఏడో తరగతి పాఠ్యపుస్తకంలో అన్ని అందమైన వర్ణ చిత్రాలు ఆధారంగా ఆర్థిక శాస్త్రాన్ని విద్యార్థులకు పరిచయం చేయనున్నామని, చరిత్ర పాఠ్యాంశాలను తేదీలు, సంవత్సరాల రూపంలో కథల రూపంలో బోధించనున్నామని తెలిపారు. వీటికి సంబంధించి ఇంకా తాజాపరిచే ప్రయత్నాలు అవసరమైతే రావచ్చు కానీ వలసవాద దృక్పథం, పేదరికం దృక్కోణం నుంచి పాఠ్యాంశాలను విముక్తి చేశామని తెలిపారు.

2012లో రూపొందించిన ఎన్సీఈఆర్టీ పుస్తకంలో ఆర్థిక అంశాలకు సంబంధించిన వివరణలన్నీ ఉద్దేశపూర్వకంగానే పేదరికానికి సంబంధించిన వ్యాఖ్యానాలతో నిండి ఉన్నాయని ఆయన ఆరోపించారు.

మార్కెట్ల గురించి అర్థం చేసుకుందామనే రెండవ అధ్యాయంలో కర్ణాటక ప్రాంతాన్ని పరిపాలించిన విజయనగర సామ్రాజ్య కాలం నాటి చారిత్రక హంపి బజారు గురించి న వర్ణన ఆధారంగా ఆధునిక మార్కెట్లు ఎలా పనిచేస్తాయో వివరించారు.ఇప్పటివరకు పాఠ్యాంశంగా ఉన్న ఏడవ తరగతి చరిత్ర పుస్తకాలకు భిన్నంగా తాజా పుస్తకం వర్తమాన వ్యవసాయ మార్కెట్లను, చేనేత కార్మికుల సహకార సంఘాలను, వర్తమాన వేతన వ్యవస్థ గురించి, వస్త్ర పరిశ్రమకు సంబంధించి కొన్ని చిత్రాలు చూపించి ఆయా పనులకు ఎంతెంత వేతనాలు ఇవ్వవచ్చని విద్యార్థి భావిస్తున్నారో ఆ మేరకు మంత్రులకు లేఖలు రాయడం గురించిన ఉదాహరణలు మాత్రమేఉన్నాయి. 6, 7 తరగతిలో బోధించే ఆర్థిక అంశాల గురించిన పాఠ్యాంశాలను సవరించిన తమ బృందం ప్రస్తుతం ఎనిమిదో తరగతి పాఠ్యాంశాలను సవరించే ప్రయత్నంలో ఉందని సన్యాల్ తెలిపారు.

### రైతులు రుణభారానికి చోటు లేని చరిత్ర:

ఇప్పటివరకు అమల్లో ఉన్న ఆరో తరగతి ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకం రెండు భాగాలుగా విభజించబడి ఉంటుంది. గ్రామీణ జీవనస్థితి కథలు పట్టణ ప్రాంత జీవనస్థితిగతులు అన్నవి ఆ రెండు భాగాలు. గ్రామీణ జీవనస్థితిగతులు అనే అధ్యాయంలో గ్రామీణ తమిళనాడు ప్రాంతంలో పంట పొలాల్లో పని చేసే కూలీలు వారి వేతనాలు గురించి చర్చ ఉండేది. ఈ మొత్తం అధ్యాయం రుణభారం మోస్తున్న రైతాంగం గురించి సముద్ర తీర ప్రాంతాల్లో నివసించే మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరణలు ఉండేవి. దీనికి భిన్నంగా తాజాగా రూపొందించిన ఆరో తరగతి పాఠ్యాంశంలో కౌటిల్యుని అర్థశాస్త్రంలోని వాక్యాలతో ప్రారంభమవుతుంది. గుజరాత్ లోని ఆనంద్ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం దేశంలో పాల ఉత్పత్తిని ఎలా విప్లవీకరించిందో వివరంగా ప్రస్థావించారు. పాత పాఠ్య పుస్తకంలో రైతాంగం మోస్తున్న రుణ భారం గురించి ఉదాహరణలతో వివరణ ఉంటే తాజాపరిచిన పాఠ్యపుస్తకంలో ఈ భాగాన్ని తొలగించారు.



**- డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

# భవన నిర్మాణ కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

**తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లేష్**

**రాజేంద్రనగర్ :** భవన నిర్మాణ కార్మికుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లేష్ అన్నారు. గండిపేట్ మండలం నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలలో భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని బిటిసి మండల కార్యదర్శి బాబురావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏఐటియూసి అనేక పోరాటాలు చేసిన 1996 లో భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాంటి బోర్డు పరిధిలో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కు అప్పగిస్తే భవన నిర్మాణ కార్మికులకు తీరని నష్టం జరుగుతుందని వివరించారు. ఈ



మేరకు ఈ నెల 17 వ తేదీన ఉదయం 11 గంటలకు స్టేట్ లేబర్ కమిషనర్ ఆఫీస్ వద్ద ధర్నాకు తరలివచ్చి భవన నిర్మాణ కార్మికుల హక్కులను కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు శంకరయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి స్వామి, శ్రీకాంత్, శ్రీనివాస్, నరేష్, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన కాలువ మరమ్మతు పనులను పరిశీలించిన
# ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

**కామారెడ్డి జిల్లా, జూన్15 :** జుక్కల్ మండలం పెద్ద ఎడగి ప్రధాన కాలువ మర మ్మతులలో గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పెద్ద కాలువ బురదమయంగా మారి చెట్లతో నిండిపోయింది. దాదాపు 20 సంవత్సరాలుగా మూసి ఉన్న ఈ కాలువను జాగ్రత్తగా చూసుకునే నాయకుడు లేకపోవడంతో రైతులు తమ పొలాలకు నీరు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యే అయిన తర్వాత తోట లక్ష్మీకాంతరావు ఈ సమస్య దృష్టికి వచ్చింది. కాలువ మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈరోజు కాలువ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ పని పూర్తయిన తర్వాత, దాదాపు 600 ఎకరాల పంట విస్తీర్ణం సరస్సు ఆయకట్టు కిందకు వస్తుంది.





# ప్రభుత్వం ఒక వర్గానికే కొమ్ము కాస్తుంది

**తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఓ వర్గానికి కొమ్ము కాస్తూ హిందువుల మనోభావాలను దెబ్బ తీస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బక్రీద్ పండుగ మరుసటి రోజు ఆదివారం రాత్రి రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని లక్ష్మీగూడ ప్రాంతంలో కళేబరాలు తరలిస్తున్న డీసీఎంలను అడ్డుకున్న ఘటనకు సంబంధించి భారతీయ జనతా పార్టీ గోరక్ష విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ హిందూ మత సంఘాల ఆధ్వర్యంలో డీసీపీ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో యువకులపై ఉన్న కేసులను రద్దు చేయడాన్ని సమీక్షించాలని, రద్దు చేయాలని, మరిన్ని అరెస్టులను నిలిపివేయాలని అభ్యర్థించడం జరిగిందన్నారు. ఇది కాకుండా ఇంకో ఐదు మందిని కూడా అబ్ స్కాండింగ్ లో పెట్టి అదర్స్ అని పెట్టారన్నారు. ప్రశాంతంగా, శాంతియుతంగా డిసిపి కలిసి ఇక్కడ వరకు ఆపాలని, చాలా ఇబ్బంది పడుతున్నారని, యువకుల కుటుంబ సభ్యులందరూ భయభ్రాంతులకు గురవుతున్నారని వివరించడం జరిగిందన్నారు. కక్షపూరితంగా ఎంఐఎం నాయకులు చెప్పారని, లేకుంటే ప్రభుత్వంలో ఉన్న నాయకులు చెప్పారని, డకాడిటిస్ అని అటెంప్ట్ మర్డర్ కేస్ అని దాదాపు 8 సెక్షన్లు పెట్టాల్సిన కేస్ అయితే కాదు అత్తాపూర్లో అవతలి వర్గం వాళ్లు కూడా ఇన్వాల్వ్మెంట్ ఉంటే వాళ్ళని ఇప్పటివరకు అరెస్టు చేసింది లేదు రిమాండ్ కు తరలించింది లేదు అని అన్నారు. సెక్షన్లన్నీ ఆల్టర్ చేయాలని, రిమాండ్ చేసింది ఉందో దాన్ని అక్కడి వరకు ఆపాలని, అత్తాపూర్ లో జరిగిన దాడిలో అవతల వర్గంలో దాడి చేసిన వారిని కూడా అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు రమేష్ బాబు, గోరక్ష ప్రముక్ విశాల్ ప్రసాద్, విశాల్ సునాకర్, భానుమూర్తి, దీపక్ యాదవ్, ముకేష్ యాదవ్, సేన రాహుల్, శ్రీరామ్ యాదవ్, డీజే శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజభూపాల్ గౌడ్, అంజన్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ తోగల శ్రీనివాస్ రెడ్డి, వై శ్రీధర్, ఎన్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, కొమురయ్య, భాగ్యనగర్ జిల్లా కార్యదర్శి నవీన్ యాదవ్, జోగి రవి, డి లక్ష్మీనారాయణ, ఎస్ విజయ్ కుమార్, అడికే రాజు,ఎన్ జగన్, ఏ.జనార్ధన్, హరికిషన్ జి, సోల్కర్ రెడ్డి, సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు ఎస్ వినయ్ రెడ్డి, సందీప్ ముదిరాజ్, సులిగే వెంకటేష్, ఎం నాగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజముద్ర
www.rajamudranews.com
తెలుగు దిన పత్రిక

నడక చక్కటి వ్యాయామం. ఎంతో సహజమైన వ్యాయామం. ఎప్పుడైనా, ఎక్కడైనా చెయ్యటానికి వీలైన, తేలికైన వ్యాయామం. నడకను ఎవరైనా, ఎప్పుడైనా మొదలుపెట్టొచ్చు. 45 ఏళ్ల లోపు వారికి ఎలాంటి పరీక్షలు అవసరం లేదు కూడా. అయితే 45 ఏళ్లు దాటినవారు.. అలాగే నడిస్తే ఆయాసం, గుండెనొప్పి, అధిక రక్తపోటు వంటి సమస్యలు గలవారు మాత్రం ముందుగా డాక్టర్‌ను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నవయసు నుంచే (టైప్1) మధుమేహం గలవారు డాక్టర్ సలహా మేరకే వ్యాయామం చేయాలి. ఎందుకంటే వీళ్లు ఇన్సులిన్ తీసుకుంటుంటారు కాబట్టి రక్తంలో గ్లూకోజు బాగా పడిపోయే (హైపోగ్లైసీమియా) అవకాశముంది. మధ్యవయసులో మధుమేహం (టైప్2) వచ్చినవారు అందరిలాగే నడవొచ్చు. కానీ ముందుజాగ్రత్తగా జేబులో రెండు గ్లూకోజు బిస్కట్లు పెట్టుకోవటం మంచిది. గ్లూకోజు పడిపోయినట్లనిపిస్తే వెంటనే తినటానికి ఉపయోగపడతాయి.



### నడిచిన కొద్దీ లాభం!!

ఒకప్పటి కంటే ఇప్పుడు ఆరోగ్య సమాచారం ఎక్కువే అందుబాటులో ఉంటోందిగానీ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ మాత్రం పెరగటం లేదు. నడవకుండా వాహనాలు, వంటింట్లో చిటికెలో పనిచేసే సాధనాలు, కూర్చునే కాలక్షేపానికి టీవీలు.. లేవకుండా పని చేసుకోవటానికి ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు.. ఇలా సౌకర్యాలు వచ్చాయి ఒంటికి వ్యాయామం తగ్గింది. ఇదే సమయంలో మానసికమైన ఒత్తిళ్లు, అనారోగ్యకరమైన తిండ్లు పెరుగుతున్నాయి. ఇవన్నీ కలిసి జబ్బులను పెంచుతున్నాయి. ప్రస్తుతం వైద్యరంగం ఎంతో పురోగమించటంతో డబ్బుంటే ఎంత పెద్ద జబ్బునైనా నయం చేసుకోవచ్చనే ధీమా ప్రజల్లో పెరుగుతుండటం ఆందోళనకరం. పరిస్థితి శ్రుతి మించకుండా తక్షణం స్పందించాల్సి ఉంది. ఇందుకు పెద్ద పెద్ద పనులేమీ చేయక్కర్లేదు. తేలికైన నడక లాంటి వ్యాయామాలు చాలు!

# నడిస్తే ప్రయోజనాలేంటో తెలుసా?

### నడకకి కావాల్సినవి

- అన్నింటికన్నా ముఖ్యంగా ఉదయాన్నే 'తప్పకుండా నడవాలి' అనే దృఢమైన దీక్ష.
- తేలికపాటి షూస్.
- కాటన్ దుస్తులు. పాలిస్టర్ వంటివి చెమటను బయటకు పోనీయవు కాబట్టి నడిచేటప్పుడు ఇవి వద్దు.

### ఎలా నడవాలి?

- సన్నద్ధం: మొదటి 5 నిమిషాలు చాలా మెల్లగా నడవాలి. దీంతో శరీరం వ్యాయామం చేయటానికి అనువుగా తయారవుతుంది. కండరాలు, కీళ్లు కదులుతాయి. ఒకేసారి వేగంగా నడవటం మొదలెడితే కండరాలు పట్టేయటం, కీళ్లనొప్పుల వంటి ఇబ్బందులు ఎదరవుతాయి.
- వేగం: మెల్లగా 5 నిమిషాలు నడిచిన తర్వాత 30 నిమిషాల సేపు వేగంగా నడవాలి. నడకలో వేగం మూలంగా ఆయాసం వంటివి రాకుండా చూసుకోవాలి. నాడీ కూడా లెక్కించుకుంటూ లక్షిత గుండె వేగంలో 3వ వంతు దాటకుండా చూసుకోవాలి.
- విశ్రాంతి: వేగంగా నడిచిన వెంటనే నడవటం ఆపరాదు. మెల్లిమెల్లిగా వేగం తగ్గించుకుంటూ రావాలి. అలా తక్కువ వేగంతో 5 నిమిషాలు నడవాలి. దీంతో కండరాలు పట్టేయటం వంటివి ఉండవు. ఒక్కసారిగా వేగాన్ని ఆపేస్తే తలతిప్పు రావొచ్చు.
- ప్రతివారం వేగంగా నడిచే సమయాన్ని 5 నిమిషాల చొప్పున పెంచుకుంటూ 30 నిమిషాల వరకు చేరుకోవాలి. శారీరంగా బలంగా గలవారు 40-60 నిమిషాల వరకూ పెంచుకోవచ్చు. అయితే రోజూ కనీసం 30 నిమిషాల సేపైనా నడిస్తే మరిన్ని ప్రయోజనాలు అందుకోవచ్చు.

### ఎన్నెన్నో ప్రయోజనాలు

- నడక శారీరక సామర్థ్యానికే కాదు, రోగనిరోధకశక్తిని పెంచి రకరకాల జబ్బుల బారినపడకుండా కాపాడుతుంది.
- గుండె సమర్థంగా పనిచేస్తుంది. గుండెపోటు రాకుండా కాపాడుతుంది.
- రక్త ప్రసరణ పెరుగుతుంది. చెమట ద్వారా రక్తంలోని మలినాలు బయటకుపోతాయి. రక్తపోటు అదుపులో ఉంటుంది.
- మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. చెడ్డ కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. రక్తంలో గ్లూకోజు స్థాయి తగ్గుతుంది.
- శరీర బరువు తగ్గుతుంది.మానసిక కుంగుబాటు, ఆందోళన, ఒత్తిడి తగ్గుతాయి.
- కంటినిండా నిద్ర పడుతుంది. పెద్దపేగు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ వంటి క్యాన్సర్ల ముప్పు తగ్గుతుంది.
- కీళ్లు, ఎముకలు దృఢమవుతాయి. నీరసం, అలసట, నిస్సత్తువ తగ్గుతాయి.
- ఆత్మ విశ్వాసం, శారీరక సామర్థ్యం పుంజుకుంటాయి. అన్నింటికన్నా మించి.. మానసిక ఉల్లాసం కలుగుతుంది.
- నడక మూలంగా కొత్త స్నేహాలు ఏర్పడతాయి. కొత్త హుషారు వస్తుంది.

### చిన్న చిన్న జాగ్రత్తలు

- మన గుండె వయసును బట్టి శ్రమ లేకుండా ఎంత వేగంగా కొట్టుకోగలదో తెలుసుకోవాలి. 220 లోంచి మన వయసును తీసేస్తే దీన్ని తెలుసుకోవచ్చు. 220 అనేది ఒక ప్రామాణిక అంకెని గుర్తుంచుకోవాలి. ఉదాహరణకు 50 ఏళ్ల వ్యక్తి గుండె గరిష్ఠ వేగాన్ని తెలుసుకోవాలంటే.. 220 నుంచి 50 తీసేయాలి. అప్పుడు 170 మిగులుతుంది కదా. అంటే 170 సార్ల వరకు గుండె ఎలాంటి ఆయాసం లేకుండా కొట్టుకోగలదన్నమాట. కానీ వ్యాయామ సమయంలో ఇంత వరకూ వెళ్లాల్సిన అవసరం కూడా లేదు.
- గుండె గరిష్ఠ వేగంలో సుమారు 50-75% వరకు గుండె కొట్టుకునేలా వ్యాయామం చేస్తే చాలు. ఉదాహరణకు 50 ఏళ్ల వ్యక్తి గుండె గరిష్ఠ వేగం 170 కదా. ఇందులో 50-75 శాతం అంటే.. 85-125 సార్ల వరకు గుండె కొట్టుకునేలా వ్యాయామం చేయాలన్నమాట.
- ఒక అరచేతిలో చూపుడు వేలు నుంచి మణికట్టు దాకా రెండో చూపుడువేలును తీసుకొస్తే డాక్టర్లు నాడీ చూసే 'రేడియల్ ధమని' ఉండే ప్రాంతం తగులుతుంది. బొటనవేలును ఉపయోగించి మన నాడీని మనమే చూసుకోవచ్చు.
- నడిచేటప్పుడు ఆయాసం లేకుండా పక్కవారితో మాట్లాడుతున్నామంటే వ్యాయామం అంతగా చేయటం లేదనే అర్థం. ఇవన్నీ ఎందుకంటే నడక మొదలుపెట్టినపుడు కొందరు.. ముఖ్యంగా బరువు తగ్గాలని అనుకునేవారు కొత్త ఉత్సాహంతో ఎక్కువగా నడుస్తుంటారు. మన శక్తి మేరకే నడవటం మంచిదనే విషయం తప్పకుండా గుర్తుంచుకోవాలి.

### అదుపు

రోజుకి 45 నిమిషాల పాటు నడిస్తే మధుమేహం అదుపులో ఉంటున్నట్టు న్యూక్యాజిల్ విశ్వవిద్యాలయ పరిశోధకులు గుర్తించారు. నడకతో కొవ్వు ఖర్చు కావటమే కాదు, కండరాల్లో చక్కెర నిల్వ సామర్థ్యమూ మెరుగవుతున్నట్టు గుర్తించారు. మన శరీరంలో చక్కెరను కండరాలు ఎక్కువగా ఉపయోగించుకుంటాయి. ఒకవేళ కండరాలు చక్కెరను గ్రహించలేకపోతుంటే రక్తంలో గ్లూకోజు స్థాయులు విపరీతంగా పెరిగిపోతాయి. ఇదే పెద్ద సమస్య. నడక వల్ల కండరాలకు చక్కెర గ్రహించే సామర్థ్యం పెరుగుతోందనీ, తద్వారా మధుమేహ దుష్ప్రభావాలూ తగ్గుతున్నాయని గ్రహించారు.

## నడక: ఎప్పుడేం జరుగుతుంది?

### 1-5 నిమిషాలు

వేగంగా అడుగులు కదపటం మొదలుపెట్టగానే కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసే రసాయనాలు ప్రేరేపితమై.. నడవటానికి అవసరమైన శక్తిని గ్రహించటం ఆరంభమవుతుంది. నడుస్తున్నకొద్దీ రక్త ప్రసరణ పుంజుకుంటుంది. గుండె కొట్టుకునే వేగం నిమిషానికి 70-100 వరకూ పెరుగుతుంది. కండరాలు నడకకు అనుకూలంగా సన్నద్ధమవుతాయి. కీళ్లలో జిగురుద్రవం ఉత్పత్తి పెరిగి, కీళ్లు బిగుసుకుంటే వదులవుతాయి. సాధారణంగా విశ్రాంతి దశలో నిమిషానికి 1 కేలరీ శక్తి ఖర్చైతే.. ఈ దశలో 5 కేలరీల వరకూ ఖర్చవుతుంది. మన శరీరం నడకకు కావాల్సిన శక్తిని పిండి పదార్థాలు, కొవ్వు నుంచి తీసుకోవటం మొదలుపెడుతుంది.



### 6-10 నిమిషాలు

గుండె వేగం 100 నుంచి 140కి పెరుగుతుంది. నడక వేగం పెరుగుతున్నకొద్దీ నిమిషానికి 6 కేలరీల శక్తి ఖర్చవుతుంది. రక్తనాళాలను వెడల్పు చేసే రసాయనాలు విడుదలై... రక్తనాళాలు విప్పారి.. కండరాలకు రక్త సరఫరా, దాంతో ఆక్సిజన్ సరఫరా మరింతగా పెరుగుతాయి.

### 11-20 నిమిషాలు

శ్రమతో శరీర ఉష్ణోగ్రత పెరగటం మొదలవుతుంది. ఈ వేడిని బయటకు పంపటానికి చెమట పడుతుంది. నడక వేగం పెరుగుతున్నకొద్దీ కొద్దిగా శ్వాస ఇబ్బందిగా అనిపిస్తుంది. నిమిషానికి 7 కేలరీల శక్తి ఖర్చవుతుంది. కండరాలకు శక్తి ఇవ్వటానికి ఎపినెఫ్రిన్, గ్లూకగాన్ వంటి హార్మోన్లు విడుదలవుతాయి.

### 21-45 నిమిషాలు

కొత్త శక్తి, ఉత్సాహం వచ్చినట్టు అనిపిస్తుంది. హాయిగా ఉన్న భావనను కలిగించే ఎండార్ఫిన్ల వంటి హార్మోన్లు మెదడులో విడుదలవుతాయి. దీంతో ఆందోళన తగ్గి ఉల్లాసం కలుగుతుంది. క్యాలరీలు ఖర్చు అవుతున్నకొద్దీ ఇన్సులిన్ సామర్థ్యం మెరుగవుతుంది. నడకను ఆపిన గంట వరకూ కేలరీలు ఖర్చు అవుతూనే ఉంటాయి. అధిక బరువు, మధుమేహంతో బాధపడేవారికిది ఎంతో మేలు చేస్తుంది.

## అపోహలు వద్దు

- పెద్దవయసులో వ్యాయామం అక్కర్లేదా? ఇదో పెద్ద అపోహ. వయసు మీద పడినవారు సహజంగానే పని తక్కువగా చేస్తారు. అందువల్ల వీరికి వ్యాయామం బాగా ఉపయోగపడుతుంది. దీంతో కీళ్ల కదలికలు మెరగవుతాయి. ఫలితంగా కీళ్లనొప్పులు వచ్చే అవకాశం తగ్గుతుంది. అయితే వయసు మీద పడ్డవారు ఎక్కువ శ్రమతో కూడిన వ్యాయామాలు చేయటం తగదు.
- వ్యాయామంతో అలసట ఎక్కువవుతుందా? ఇది నిజం కాదు. వ్యాయామం చేయటం వల్ల శరీర సామర్థ్యం (ఫిట్‌నెస్) పెరుగుతుంది. అలసట, నీరసం, ఆందోళన తగ్గుతాయి.
- వ్యాయామంతో సమయం వృథా అవుతుందా? ఇది అతిపెద్ద అపోహ. వ్యాయామం చేయటం ఇష్టం లేనివాళ్లు చెప్పే సాకు. ప్రతిరోజూ.. లేదంటే కనీసం వారానికి 3-4 రోజులైనా వ్యాయామం చేయాలి. 30 నిమిషాల సేపు వ్యాయామం చేయలేనివాళ్లు 15 నిమిషాల చొప్పున 2 సార్లు కూడా చేయొచ్చు.
- సాయంత్రం నడవకూడదా? ఉదయం పూట నడవటం వీలుపడకపోతే సాయంత్రం వేళల్లోనూ నడవొచ్చు. కాకపోతే కాలుష్యం తక్కువగా ఉంటుంది కాబట్టి ఉదయం నడవటం మంచిది.
- అన్ని వ్యాయాలూ ఒకటేనా? వ్యాయామాలు రెండు రకాలు. ఒకటి బరువు తగ్గించుకోవటానికి చేసేవి. వీటిని వేగంగా చేయాల్సి ఉంటుంది. ఒకింత ఎక్కువసేపూ చేయాలి. చెమట బాగా పట్టాలి. ఇక రెండోది - శారీరక సామర్థ్యానికి, కండరాలు దృఢంగా ఉండటానికి, కీళ్లనొప్పుల బారినపడకుండా ఉండటానికి కొద్దిపాటి వేగంతో నడిస్తే చాలు. దీంతో గుండె, వూపిరితిత్తులు బలం పుంజుకుంటాయి.

- హెచ్చరిక: కడుపు నిండా భోజనం చేసి నడవటం మంచిది కాదు.
- సూచన: 2-3 రోజులు హడావిడిగా నడిచి తర్వాత మానెయ్యటం కంటే రోజూ నడిస్తేనే ప్రయోజనం.
- జాగ్రత్త: కొన్ని రోజులు నడిచి ఆపేసినవాళ్లు తిరిగి నడవాలని అనుకుంటే.. నెమ్మదిగా, ఆరంభించాలి.
- ముఖ్యం: మధుమేహులకు ఆహార జాగ్రత్తలు, మందులు... వీటితో పాటు వ్యాయామమూ ముఖ్యమే.
- సమయం: వ్యాయామం అనగానే గంటల తరబడి చెయ్యాల్సిన పని లేదు. రోజుకు అరగంట చాలు.
- ప్రణాళిక: నడక తక్కువ దూరంతో మొదలుపెట్టి, క్రమంగా రోజురోజుకూ పెంచుకుంటూ పోవాలి.
- ప్రయోజనం: నడకతో ఒక్క మధుమేహ నియంత్రణే కాదు.. మొత్తం శారీరక ఆరోగ్య స్థితే మెరుగవుతుంది.
- నడకతో మధమేహం రాకుండా నివారించుకునే అవకాశమూ ఉన్నట్టు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లోని మర్డోక్ చిల్డ్రన్స్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనంలో వెల్లడైంది. ఎక్కువ నడిచేవారిలో శరీర బరువు తగ్గటంతో పాటు వారిలో ఇన్సులిన్ మరింత సమర్థంగా పని చేస్తున్నట్టు వెల్లడైంది.




## ఐపీఓకు ముందు రూ.260 కోట్లు
## సమీకరించిన హీరో ఫిన్‌కార్ప్

ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ ఆర్థిక సేవల విభాగం హీరో ఫిన్‌కార్ప్ లిస్టింగ్‌ను వేగవతం చేస్తోంది. అందులో భాగంగానే ఐపీఓకు ముందు రూ.260 కోట్లను సమీకరించింది. దీంతో పబ్లిక్ ఇష్యూలో విక్రయించాల్సిన తాజా షేర్ల మొత్తం రూ.2,100 కోట్ల నుంచి రూ.1,840 కోట్లకు తగ్గింది. మొత్తం ఐపీఓ పరిమాణం రూ.3,668 కోట్ల నుంచి రూ.3,408 కోట్లకు తగ్గింది. ఇందులో రూ.1,568 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి పెట్టారు. జూన్ 5న కంపెనీ నిర్వహించిన ప్రీ- ఐపీఓ రౌండ్‌లో 12 మంది పెట్టుబడిదారులతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఒక్కో షేరు రూ.1,400 చొప్పున 18.57 లక్షల వాటాలను వారికి కేటాయించింది. దీని ద్వారా రూ.260 కోట్లు సమీకరించింది. హీరో ఫిన్‌కార్ప్ ఐపీఓ ప్రణాళికను గతేడాది ప్రకటించింది. నాటి నుంచి వీటి పబ్లిక్ ఇష్యూ రాక కోసం మదుపర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మేలో సెబీ నుంచి ఐపీఓకు అనుమతి లభించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్ని భవిష్యత్తు రుణ కార్యకలాపాల కోసం కంపెనీ మూలధనాన్ని పెంచేందుకు ఉపయోగించనుంది. హీరో ఫిన్‌కార్ప్ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ. రిటైల్, సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి వ్యాపారాలకు రుణాలు అందిస్తోంది. 2024 మార్చి నాటికి కంపెనీ ఆస్తులు రూ.51,821 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ కంపెనీకి 1.18 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారు.

## జాతీయ జట్టు కంటే ఐపీఎల్‌కే
# అధిక ప్రాధాన్యత ఇచ్చారు

### ఆసీస్ ఓటమిపై మండిపడ్డ మాజీ




ప్రతిష్ఠాత్మక డబ్ల్యూటీసీ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఆస్ట్రేలియా ఓటమి పాలైంది. దీంతో వరుసగా రెండో సారి డబ్ల్యూటీసీ గదను అందుకోవాలనుకొన్న ఆ టీమ్‌కు నిరాశే ఎదురైంది. ఈ ఓటమి నేపథ్యంలో ఎక్కడ పొరపాట్లు జరిగాయే ఆ జట్టు మాజీ ఆటగాళ్లు విశ్లేషిస్తున్నారు. ఆ జట్టు మాజీ మిచెల్ జాన్సన్ ఒక అడుగు ముందుకేసి పలువురు ఆటగాళ్ల తీరుపై మండిపడ్డాడు. జట్టు ప్రయోజనాలకంటే.. ఐపీఎల్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించాడు. మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్, నాథన్ లైయన్‌తో కూడిన బౌలింగ్ 'బిగ్ ఫోర్' విఫలమైందని మిచెల్ జాన్సన్ అభివర్ణించాడు. ముఖ్యంగా హేజిల్‌వుడ్ తీరుపై తీవ్ర విమర్శలు చేశాడు. "ఇటీవల కాలం హేజిల్‌వుడ్ ఫిట్‌నెస్‌పై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అతడు జాతీయ జట్టు కంటే ఐపీఎల్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. వాయిదా పడ్డ అనంతరం ప్రారంభమైన ఐపీఎల్‌కు తిరిగి వెళ్లాలన్న అతడి నిర్ణయం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. ఇక లైయన్ వికెట్లు తీయడంలో విఫలమయ్యాడు" అని విమర్శించాడు. డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై ఐదు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయంతో 27 ఏళ్ల తర్వాత తొలిసారి ఐసీసీ టైటిల్‌ను ఆ జట్టు చేజిక్కించుకుంది.

## ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్.. కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్



ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో.. కొత్త సారథి శుభ్‌మన్ గిల్ నేతృత్వం వహిస్తుండటంతో ఈ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. అయితే, ఈ సిరీస్‌లో కొన్ని మ్యాచ్‌లకు ప్రధాన కోచ్ గంభీర్ అందుబాటులో ఉండే పరిస్థితులు కనిపించడం లేదు. తన తల్లి ఆరోగ్యం పరిస్థితుల నేపథ్యంలో అతడు ఇంగ్లాండ్ నుంచి . ఈ నేపథ్యంలో కోచ్ బాధ్యతలను నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) ఛైర్మన్ వీవీఎస్ లక్ష్మణ్ చేపట్టనున్నట్లు సమాచారం. అండర్-19 జట్టు ఇంగ్లాండ్ పర్యటనలో భాగంగా లక్ష్మణ్ ప్రస్తుతం లండన్‌లోనే ఉన్నారు. గంభీర్ తిరిగి వచ్చేంత వరకు టీమిండియాకు ఆయన దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌కు లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరించారు. అయితే, గంభీర్ తిరిగి ఇంగ్లాండ్ ఎప్పుడు వెళ్తాడన్నదానిపై స్పష్టమైన సమాచారం లేదు. కాగా, భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ జూన్ 20న లీడ్స్‌లో మొదలవుతుంది.



## విజయానికి చేరువకాగానే ఆసీస్
## మాపై స్లెడ్జింగ్‌కు దిగింది: బవుమా

డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఓడించి దక్షిణాఫ్రికా చిరస్మరణీయ విజయాన్ని సాధించింది. ఇది ఆ దేశ క్రికెట్ చరిత్రలోనే ఎంతో ప్రత్యేకమైంది. ఎందుకంటే 27 ఏళ్ల అనంతరం తొలిసారి ఐసీసీ టైటిల్‌ను నెగ్గి.. తమపై ఉన్న 'చోకర్స్' ముద్రను చెరిపేసుకుంది. అయితే.. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఆసీస్ తమపై ఓ దశలో స్లెడ్జింగ్‌కు దిగినట్లు దక్షిణాఫ్రికా కెప్టెన్ తెంబా బవుమా ఆరోపించాడు. తమ జట్టు విజయం దిశగా సాగుతున్న నేపథ్యంలో ఆసీస్ ఆటగాళ్లు నోటికి పనిచెప్పినట్లు తెలిపాడు. మ్యాచ్ నాలుగో రోజు ఈ ఘటన చోటుచేసుకున్నట్లు బవుమా వెల్లడించాడు. బవుమా- మార్‌క్రమ్ అద్భుత భాగస్వామ్యం జట్టును విజయ తీరాలకు చేర్చుతున్న సమయంలో.. వారి ఏకాగ్రతను దెబ్బతీసేందుకు ఆసీస్ ఆటగాళ్లు అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. చివరి ప్రయత్నంగా స్లెడ్జింగ్‌కు కూడా దిగినట్లు తెలుస్తోంది. తాను బ్యాటింగ్ చేసేటప్పుడు ప్రత్యర్థి ఆటగాళ్ల నుంచి 'చోకర్స్' అనే పదాలు వినిపించాయని బవుమా తెలిపాడు. 'బ్యాటింగ్ చేసేటప్పుడు ఆ భయంకరమైన చోకర్స్ పదాన్ని మేం విన్నాం. ఎంతో నమ్మకంతో ఈ మ్యాచ్ ఆడేందుకు వచ్చాం. మాపై ఎన్నో సందేహాలు ఉన్నాయి. అయితే.. మా ఆటతీరు, ఈ విజయం వాటన్నింటినీ తుడిచిపెట్టింది. ఇది మా దేశానికి స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను" అని మ్యాచ్ అనంతరం ఓ మీడియా ఛానల్‌తో మాట్లాడుతూ బవుమా అన్నాడు. ఇక 'చోకర్స్' గురించి ఆ జట్టు స్పిన్నర్ కేశవ్ మహారాజ్ మాట్లాడుతూ.. ఈ ట్యాగ్ చాలా కాలంగా మమ్మల్ని ఇబ్బంది పెడుతోందని.. అయితే ఇప్పుడు అది చరిత్రలో కలిసిపోయిందని ఆనందం వ్యక్తం చేశాడు.



## ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలతో చమురు, బంగారం,
# విమాన టికెట్లకు రెక్కలు

**ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు మరో యుద్ధానికి దారి తీస్తాయనే ఆందోళనలు అంతకంతకూ తీవ్రమవుతున్నాయి. ఈ పరిణామాలతో ముడిచమురు ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉండగా, విమాన రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయాలు ఏర్పడనున్నాయి. అమెరికాతో ఇరాన్ అణు చర్చలు కూడా నిలిచిపోయినట్లేనని ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఏ అంశాలపై ఎలా ప్రభావం చూపించొచ్చంటే..**

### ముడిచమురు ధరలపై:

ఇజ్రాయెల్ చేపట్టిన ఆపరేషన్ లయన్, తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులు పూర్తిస్థాయి యుద్ధానికి దారితీస్తుండగా, ఇది ప్రపంచ దేశాలపై అనేక ప్రతికూల ప్రభావాలకు కారణం అవుతున్నాయి. ముఖ్యంగా ముడిచమురు ధరలు భారీగా పెరగనున్నాయి. ఇరాన్ నుంచి సరఫరాలో అంతరాయాల కారణంగా ముడిచమురు ధరలకు రెక్కలు వస్తున్నాయి. ఫలితంగా డీజిల్, పెట్రోల్ ధరలు కూడా పెరగవచ్చు. ఇరాన్ నిత్యం 3.3 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురు ఉత్పత్తి చేస్తుంది. 1.5 మిలియన్ బ్యారెళ్లను ఎగుమతి చేస్తుంది. ప్రపంచ చమురు వాణిజ్యంలో 20 శాతం హెూర్ముజ్ జలసంధి ద్వారా సాగుతుంది. తమపై దాడులు చేస్తే ఈ రవాణాను అడ్డుకుంటామని గతంలో ఇరాన్ హెచ్చరించింది. ప్రస్తుతానికి సౌదీ అరేబియా, యూఏఈ నుంచి ముడిచమురు సరఫరా తాతాలికంగా సమస్యను తీవ్రం కాకుండా అడ్డుకునే అవకాశం ఉంది. ఒకవేళ ఇరాన్ జలసంధిని మూసివేస్తే ముడిచమురు ధరలు 120 డాలర్ల నుంచి 130 డాలర్లకు పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### విమానయాన ఖర్చులపై :

గగనతలం మూసివేతల నేపథ్యంలో విమానయాన ఖర్చులు భారీగా పెరగనున్నాయి. అంతేకాదు విమాన సర్వీసులు బాగా ఆలస్యం నడవనున్నాయి. మరీ ముఖ్యంగా గతంలో పౌర విమానాలు కూల్చివేసిన ఘటనలను దృష్టిలో పెట్టుకొంటే తాజా పరిణామాలు విమాన భద్రతాపరమైన ఆందోళనలను పెంచుతున్నాయి. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఘర్షణల కారణంగా ఎయిరిండియా ఒకటే 20 విమానాలను దారి మళ్లించింది. పలు దేశాలు తమ గగనతలాలను మూసివేయడం వల్ల ముంబయి-లండన్ మార్గం సహా సౌదీ అరేబియా లేదా తుర్కియే మార్గాల్లో రద్దీ పెరుగుతుంది. ఫలితంగా విమాన రద్దీ నియంత్రణపై ఒత్తిడి పెరుగుతుంది. నిర్వహణ ఖర్చులు పెరుగుతుండడం వల్ల ఆయా సంస్థలు టికెట్ ధరలు పెంచే అవకాశం ఉంది. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-గాజా మధ్య ఘర్షణలతో ఇప్పటికే భారంగా ఉన్న విమానయాన పరిశ్రమ తాజా పరిణామాలతో మరింత ఒత్తిడిని ఎదుర్కోనుంది. పసిడి ధరపై: ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఘర్షణల వల్ల బంగారం ధరలు కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే, యుద్ధాల సమయంలో పెట్టుబడిదారులు నష్టభయం లేని బంగారం వంటి వాటికి తమ డబ్బులను మళ్లిస్తారు. దీని వల్ల సహజంగానే పసిడి ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇది సామాన్యులకు భారంగా మారుతుంది.

### ఎగుమతి ఖర్చులపై:

సూయిజ్ కెనాల్, ఎర్ర సముద్ర మార్గాలను మూసివేత ఫలితంగా భారత్ ఎగుమతులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. ఇజ్రాయెల్-ఇరాన్ ఘర్షణల వల్ల భారత ఎగుమతులను వేరే మార్గాలకు మళ్లించాల్సి ఉంటుంది. దీని వల్ల ఖచ్చితంగా రవాణా ఖర్చులు పెరుగుతాయి. సూయిజ్ కాలువ, ఎర్ర సముద్ర మార్గాలు మూసివేయడం వల్ల భారత నౌకలు కేప్ ఆఫ్ గుడ్ హెూప్‌ను దాటి వెళ్లాల్సి వస్తుంది. దీని వల్ల అవి గమ్యస్థానానికి చేరడానికి



15 నుంచి 20 రోజులు పడుతుంది.
ఈ ఆలస్యం మూలంగా ఒక్కో కంటైనర్‌పై 500-1000 డాలర్ల వరకు అదనపు భారం పడుతుంది. ఫలితంగా ఎగుమతుల ఖర్చులు 40-50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ఇరాన్ నుంచి నేరుగా ముడిచమురు దిగుమతులు చేసుకోవడానికి ఇబ్బంది కలుగుతుంది. ఇది కూడా చమురు ధరలు పెరగడానికి కారణం అవుతుంది.

రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
www.rajamudranews.com



# విష్ణు ప్రియ బోల్డ్ షో

బిగ్‌బాస్ ఫేమ్ విష్ణు ప్రియ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. కెరీర్ స్టార్టింగ్‌లో షార్ట్ ఫిల్మ్స్ చేసిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత ఈటీవీ ప్లస్‌లో వచ్చిన 'పోవే పోరా' అనే గేమ్ షోకు యాంకరింగ్ చేసింది. ఆ తర్వాత అనేక టీవీ షోలో పాల్గొని మంచి గుర్తింపు సంపాదించుకున్నది. దీంతో బిగ్‌బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టే చాన్స్ వచ్చింది. అక్కడ ఈ భామ చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. అక్కడ పృద్వీతో ప్రేమలో పడి ముద్దులు కూడా ఇచ్చేసింది. అయితే అతనిపై ఉన్న ఇంట్రెస్ట్ గేమ్‌పై లేకపోవడంతో వెంటనే హౌస్ నుంచి బయటకు వచ్చేసింది. ఇక బయటికి వచ్చాక అడపాదడపా షోస్‌లలో పాల్గొంటుంది. కానీ నిత్యం సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్‌గా ఉంటూ తన అందాలతో నెట్టింట రచ్చ చేస్తుంది. క్రమంలో ఈ అమ్మడు ఫొటోస్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా విష్ణు తన ఇన్‌స్టాలో కొన్ని పిక్స్ షేర్ చేసింది. అందులో బ్లాక్ కలర్ డ్రెస్‌లో వైట్ స్కిన్ మొత్తం కనిపించేలా హాట్ షో చేసింది. అలాగే ప్రైవేట్ పార్ట్స్ కనిపించేలా క్లీన్ బోల్డ్ షో చేసింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక వాటిని చూసిన నెటిజన్లు నువ్వు మొత్తం విప్పి చూపిన నిన్ను ఎవడూ దేకడూ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# అతను ముద్దిస్తావా అని అడిగాడు..

## మాళవిక మోహనన్

'పట్టం పోల్' అనే మలయాళ సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్ మాళవిక మోహనన్ గురించి స్పెషల్‌గా చెప్పనక్కర్లేదు. ఈ బ్యూటీ తన ఫస్ట్ మూవీతోనే కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్ అయిపోయింది. అలాగే తన నటనతో కూడా బాగా క్రేజ్ తెచ్చుకుంది. ప్రస్తుతం తెలుగు ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వడానికి రెడీగా ఉంది. ఇందులో భాగంగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సరసన 'రాజా సాబ్' సినిమాతో మన ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోన్న ఈ సినిమాకి టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవికా మోహనన్ మాట్లాడుతూ.. నా కాలేజ్ డేస్‌లో రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ముంబై లోకల్ ట్రైన్‌లో నా స్నేహితురాళ్లతో కలిసి ప్రయాణించాను. అప్పుడు మేము కూర్చున్న ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ దాదాపు ఖాళీగా ఉందని, అప్పుడు ఒక వ్యక్తి కిటికీ గ్రిల్‌కు దగ్గరగా వచ్చి, ఏక్ చుమ్మా దేగి క్యా? (ఒక ముద్దు ఇస్తావా?) అని అసభ్యంగా అడిగాడు. ఆ సమయంలో మేము ముగ్గురం పూర్తిగా నిస్సహాయంగా ఉండిపోయాము, ఏం చేయాలో తెలియక భయంతో వణికిపోయాము. సుమారు 10 నిమిషాల తర్వాత తదుపరి స్టేషన్ రావడంతో ప్రయాణికులు కంపార్ట్‌మెంట్‌లోకి రావడంతో మేమంతా ఊపిరి పీల్చుకున్నాము అని చెప్పింది.





# ప్రభాస్ ఎలాంటి వ్యక్తో త్వరలోనే తెలుస్తోంది..

## - నిధి అగర్వాల్

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ నిధి అగర్వాల్ వరుస చిత్రాల్లో నటిస్తూ ఫుల్ బిజీ అయిపోయింది. ప్రస్తుతం ఈ అమ్మడు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సరసన 'ది రాజా సాబ్' మూవీలో నటిస్తోంది. మారుతి దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. అయితే ఇందులో రిద్ధి కుమార్, మాళవిక మోహనన్, యోగిబాబు, సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. అయితే ఈ సినిమా డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇక మూవీ మేకర్స్ వరుస అప్డేట్ రిలీజ్ చేస్తూ ఫ్యాన్స్‌కు ట్రీట్ ఇస్తున్నారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిధి అగర్వాల్ ప్రభాస్‌పై ప్రశంసలు కురిపించింది. "ప్రభాస్ సార్ చాలా గొప్ప నటుడు. ఆయన చాలా మంది ప్రజలకు సినీ ప్రముఖులకు ఎంతో సాయం చేస్తారు. అయితే ఆయన ఎంత గొప్పవాడో ప్రజలకు తెలియాలని ఇవన్నీ చేయడం లేదు. ఆయన ఎలాంటి వారో ఎవరికి చూపించాల్సిన అవసరం లేదు. ఆయన తన వైబ్‌తో నిలబడగలడు. ప్రభాస్ చాలామంచి వారు. ఆయన ఎలాంటి మానవుడో మీ కూడా త్వరలోనే తెలుస్తోంది" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com